హైదరాబాద్ వార్త






# కన్సల్టెన్సీలతో జాగ్రత్త!

**-విదేశీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోలకు కుచ్చుటోపి**
**-ఉన్నతాధికారులు,ప్రభుత్వం పెద్దలు తెలుసంటూ వల**
**-నగరంలో పెరిగిపోతున్న వైట్‌కాలర్స్‌దందా**
**-మోసపోతున్న నిరుద్యోగ యువత**

**హైదరాబాద్, మే 18, ప్రభాతవార్త:** మీకు సాఫ్ట్ వేర్ జాబ్ కావాలా...గవర్నమెంట్ జాబ్‌కావాలా ఏదో మీరే డిసైడ్ చేసుకోండి. ప్రభుత్వమే మనది అందులోని అధికారులతా మనోళ్లే..కానీ కొంత డబ్బు చెల్లించాల్సి ఉంటుందంటూ నిరుద్యోగులకు ఆశచూపి వారినుండి డబ్బు వసూలు చేసి ఆతర్వాత బోర్డు తిప్పేస్తున్న జాబ్‌కన్సల్టెన్సీలు ఒకవైపు...మీరు ఉన్నత చదువులకోసం అమెరికా వెళ్తారా..లండన్ వెళ్తారా ..అక్కడ యూనివర్సిటీల్లో సీట్లు ఇప్పిస్తాం.. పాస్‌పోర్ట్, వీసా ఇప్పించి మిమ్ముల్ని అక్కడికి చేరుకునేదాక చూసుకుంటాం అంటూ డబ్బువసూలు చేసి బోర్డు తిప్పేసే సంస్థలు మరోవైపు.. ఈవిధంగా నిత్యం ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న సంస్థలు నగరలో వందలకొద్దీ ఉన్నాయి.. నిరుద్యోగులు,మధ్యతరగతి కుటుంబికులను టార్గెట్ చేసి వారిని నమ్మిస్తూఅందినకాడికి దోచుకుని ఉడాయిస్తున్నారు. ఈరకమైన మోసాలు పాల్పడేవారు పెద్దపెద్ద రాజకీయ నాయకులు,ప్రభుత్వశాఖల్లో పనిఏసే ఉన్నతాధికారులతో మంచి సంబంధాలు ఉన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**ఎలా ప్రవర్తిస్తారంటే..**

ముందస్తు ప్రణాళికలో భాగంగా తమ వద్దకు వచ్చిన వారి అవసరాన్ని తెలుసుకుని మర్యాదగా మాట్లాడుతారు. వారికోసం సంబంధిత ఆఫీసర్‌తో మాట్లాడుతున్నట్లు బిల్డప్ ఇస్తారు. చదువు అర్హత పత్రాలు తీసుకొని....జాబువచ్చాకనే డబ్బులు చెల్లించండి అంటారు. వారు చెప్పిన చోటుకి నిరుద్యోగులు రాగానే ముందుగా ఏర్పాటు చేసుకున్న మరో వ్యక్తితో కలిసి అక్కడి కార్యాలయం నుండి కిందకు వస్తారు. మీకు ఉద్యోగం గ్యారెంటీ అని అతడి ద్వారా హామీ ఇప్పిస్తారు. అన్ని పత్రాలు ఇచ్చి వెళ్లండి మిగతా విషయాలు నేను చూసుకుంటామని తీసుకువచ్చిన వ్యక్తితో చెబుతారు.అతను పోగానే ఉద్యోగం కోసం వచ్చిన వారితో బేరసారాలకు దిగి అడ్వాన్స్ రూపంలో కొంత తీసుకుంటారు. ఆతర్వాత వారు ఉండే ప్రాంతాల నుండి ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు. ఇటీవల నగరంలో ఇలాంటి సంఘటనలే ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు,మెట్రో ఉద్యోగాలు పేరుతో సామాన్యులను అందినకాడకి దోచుకుంటున్నారు. ఇలాంటి వారిచేతుల్లో ఎక్కువగా మోసపోయేది అమాయకులు,పేద మధ్యతరగతి ప్రజలే కావడంతో చాలామంది పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు రావడం లేదు.ఇలాంటి వాటిపై అవగాహన లేకపోవడంతో అమాయకులు దగాపడుతున్నారు.వారి మోసాలకు చెక్‌పెట్టా లంటే ఇలాంటి వారిపై ప్రజల్లో అవగాహణ కల్పించాలని పలువురు నిపుణులు తెలుపు తునాన్నరు.

**తాజాగా జరిగిన పలు సంఘటనలు..**

విదేశాల్లో ఉద్యోగంఅంటూ..ఒకొక్కరి నుంచి 6లక్షలు మియాపూర్ హఫీజ్ పేట్ లో ఉద్యోగాల పేరుతో కేటుగాళ్లు నిరుద్యోగులను నిలువునా మోసం చేశారు. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించారు. ఒక్కో వ్యక్తి వద్ద నుంచి ఆరు లక్షల చొప్పున వసూలు చేశారు. అందిన కాడికి దోచుకుని పరారయ్యారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హఫీజ్ పేట్ లోని సి.డి. దశరథ్ కన్సల్టెన్సీ పేరుతో ఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడంతో ప్రకటన చూసిన చాలా మంది నిరుద్యోగులు హఫీజ్ పేట్ కార్యాలయంలో సంప్రదించారు. ఒక్కొక్కరు రూ.6 లక్షల చొప్పున చెల్లిస్తే వీసా ట్రావెల్స్ అంత మేము ఏర్పాటు చేస్తామంటూ నమ్మించారు. అదును చూసి బోర్డు తిప్పేసారు. సుమారు 90 మంది నిరుద్యోగుల నుంచి రూ.5కోట్లు వసూలు చేసినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులు అర్చన ప్రియ, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ ల పై బాధితులు మియాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈజిప్ట్, ఇజ్రాయల్ లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఈజిప్ట్ వరకు తీసుకెళ్లిన కేటుగాళ్లు.. అక్కడ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో బాధితులు ఖంగు తిన్నారు. చేసేదేమీ లేక సొంత ఖర్చులతో వెనుతిరిగి నగరానికి చేరుకున్నారు. హఫీజ్ పేట్ లోని ఆఫీస్ మూతపడడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు బాధితులు.

**జాబ్ ఇప్పిస్తానని మహిళను నమ్మించి..**

హైదరాబాద్‌లో మరో మోసం వెలుగులోకి వచ్చింది. ఉద్యోగం ఇప్పిస్తానంటూ సోషల్ మీడియా ద్వారా ఓ నిరుద్యోగ మహిళను నమ్మించి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అంబర్‌పేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని కూకట్‌పల్లిలో నివాసముండే టి.కిశోర్(30) ఓ సంస్థలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈజీ మనికి అలవాటు పడ్డ కిశోర్ పేస్ బుక్ ద్వారా అంబర్‌పేటకు చెందిన ఓ నిరుద్యోగ మహిళలకు పరిచయమయ్యాడు. ప్రముఖ సంస్థలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. అనంతరం వాట్సాప్ ద్వారా నకిలీ జాయినింగ్ ఆర్డర్లు పంపి వివిధ ఫేక్ బ్యాంకు ఖాతాల్లో రూ.2లక్షల 30 వేలు జమచేయించుకుని మోసానికి పాల్పడ్డాడు. బాధిత రాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు కిశోర్ అరెస్ట్ చేసి అతని వద్ద రూ.2లక్షల నగదు, మరో రూ.25వేల అతని బ్యాంకు ఖాతాలో ఫ్రీజ్ చేశారు.

**ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం ఇస్తామని..**

సైబరాబాద్ పరిధిలో ఉద్యోగాల పేరుతో జరిగిన భారీ మోసం గతనెలలో వెలుగులోకి వచ్చింది. ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం ఇస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి క్యామెల్ ఐక్యూ సొల్యూషన్స్ సంస్థ ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.80 వేల వరకు మొత్తంగా 452 మంది నుంచి డబ్బు వసూలు చేసింది. వారిని నమ్మించేందుకు కొన్నాళ్లు వేతనాలు ఇచ్చి.. తర్వాత ఆపేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు క్యామెల్ ఐక్యూ సంస్థపై మాదాపూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మోసాలకు పాల్పడిన ముఠాలో ఎరుకల మహేశ్, నజీర్ బాషా, ఉదయలక్ష్మి అనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి కారు, బైకు సహా సెల్ఫోన్లు, చెక్ బుక్ లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే తరహాలో గతంలో మోసపోయిన తర్వాత ఎరుకల రమేశ్ ఆఫీసు పెట్టినట్లు తెలుస్తోంది.

# మెట్రోకు కొత్త కోచ్‌లు..!

**-ప్రయాణీకులకు తప్పనున్న తిప్పలు**
**-60 కొనుగోలు చేయాలని నిర్ణయం**
**-బెంగళూరుకు చెందిన బీఈఎంఎల్ తయారీకి 15 నెలల సమయం**
**-ప్రస్తుతం మూడు కారిడార్లలో 56 మెట్రో రైళ్లు పరుగు**

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త**

మెట్రో ప్రయాణికులకు తీపికబురు అందింది. ఇక నుంచి ప్రయాణికులకు నిల్చోని ప్రయాణం చేసే బాధ తప్పనుంది. హాయిగా కూర్చోని ప్రయాణం చేయవచ్చు. ప్రభుత్వం కొత్త కోచ్‌ల కొనుగోలుపై కీలక ముందడుగు వేసింది. త్వరలో ప్రత్యేక కోచ్‌లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం తిరుగుతున్న మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న రైళ్లల్లోని కోచ్‌లు ప్రయాణికుల రద్దీ అవసరాలకు తగ్గట్లు లేవు. రద్దీ ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు నిల్చోని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉండటంతో కనీసం నిల్చోని ప్రయాణం చేయడానికి కూడా ఖాళీ ఉండటం లేదు. దీంతో తర్వాతి ట్రైన్ కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ప్రస్తుతం సమ్మర్ కావడంతో మెట్రోలో రద్దీ విపరీతంగా పెరిగింది. జనంతో మెట్రో రైళ్లు కిటకిటలాడుతున్నాయి.ఉదయం, సాయంత్రం రద్దీవేళల్లో



నాగోల్-రాయదుర్గం, ఎల్బీనగర్-మియాపూర్ మార్గాల్లో ఇప్పుడున్న కోచ్‌లు ఏ మాత్రం చాలడం లేదు. అప్పట్లో నాగ్‌పూర్ నుంచి లీజుకు తీసుకునే ప్రయత్నాలు చేసినా ఆ వ్యవహారం సాధ్య పడలేదు. ఈ ఏడాది ఆర్డర్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైనా పలు సాంకేతిక కారణాలతో వాయిదా పడింది. మెట్రోరైలు ప్రభుత్వం ఆధీనంలోకి రావడంతో కొత్త కోచ్‌ల కొనుగోలుకు అడ్డంకులన్నీ పూర్తిగా తొలగిపోయాయి.

**మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లు**

ఈ క్రమంలో మెట్రో రైళ్లల్లో కొత్త కోచ్‌లు తీసుకురావాలని అధికారులు ఎప్పటినుంచో భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పుడు మరో ముందడుగు పడింది. ఇటీవల మెట్రోను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో కొత్త కోచ్‌ల ప్రతిపాదన మరోసారి తెరపైకి వచ్చింది. ఇందుకు వేగంగా చర్యలు చేపడుతున్నారు. దాదాపు 60 కొత్త కోచ్‌లను కొనుగోలు చేయాలని రేవంత్ సర్కార్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. కొత్త కోచ్‌ల కోసం బెంగళూరుకు చెందిన భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)తో చర్చలు జరుపుతోంది. ఆ సంస్థ కొత్త కోచ్‌లను సరఫరా చేయనుండగా.. త్వరలో ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోనుంది. త్వరలోనే అధికారికంగా ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని తెలుస్తోంది.15 నెలల్లోనే కొత్త కోచ్‌లు సరఫరాతెలంగాణ ప్రభుత్వం ఆర్డర్ ఇస్తే.. 15 నెలల్లోనే కొత్త కోచ్‌లను బీఈఎంఎల్ సరఫరా చేయనుంది.

**ప్రస్తుతం సరిపోని కోచ్‌లు...**

2015లో రూ.1800 కోట్ల ఖర్చు చేసి సౌత్ కొరియాలోని హ్యుందాయ్ రొటెమ్ నుంచి మెట్రోరైలు కోచ్‌లను కొనుగోలు ఎల్ అండ్ టీ కంపెనీ వారు చేశారు. అందులో ఒక్కో మెట్రోకు 3 కోచ్‌లు ఉన్నాయి. ఏకకాలంలో ఇందులో 965 మంది ప్రయాణికులు వెళ్లే అవకాశం ఉంది. దేశంలోనే మొదట ప్రవేశపెట్టిన డ్రైవర్‌లెస్ సాంకేతికతకు తగ్గట్టుగా వీటిని అత్యాధునికంగా డిజైన్ చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని 3 కారిడార్లలో మొత్తం 56 మెట్రోరైళ్లు తిరుగుతున్నాయి. ఒక్కో రైలుకు 3 కోచ్‌లు మాత్రమే ఉండగా.. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఇవి సరిపోవడం లేదు. దీంతో కొత్త కోచ్‌లను ఏర్పాటు చేస్తే ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. ప్రయాణికులు నిల్చోని ప్రయాణం చేసే సమస్య కాస్త తగ్గుతుంది. రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడమే కాకుండా ప్రయాణికుల సీటింగ్ సామర్థ్యం పెరుగుతుంది. దీని వల్ల మెట్రో ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణం అందనుంది.

# ఉప్పల్‌లో ట్రాఫిక్ తిప్పలు .. గల్లీలో వాహనాల రద్దీ

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో కారిడార్ నిర్మాణం కారణంగా ట్రాఫిక్ దారిమళ్లింపు చేపట్టడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వరంగల్ జాతీయ రహదారిలో నిర్మిస్తున్న కారిడార్ పిల్లర్ నిర్మాణం కారణంగా మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ దారి మళ్లించారు. అయితే దూర ప్రాంత ప్రయాణికులకు దీనిపై అవగాహన లేకపోవడంతో ఉప్పల్ వరకు వచ్చిన తర్వాత చిక్కులో పడుతున్నారు.పలు చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసినా వీటిని పట్టించుకోకుండా వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో ఉప్పల్ వద్ద ట్రాఫిక్ రద్దీ నెలకొంటుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళలలో వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.

**ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు :**

ఉప్పల్ చౌరస్తా నుంచి రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల కారణంగా మూడు నెలల పాటు ఉప్పల్ రింగ్ రోడ్డును మూసివేయనున్నట్లు మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్, నగర ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. దీంతో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చే వాహనాలు, అలాగే హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లిస్తున్నారు. అదేవిధంగా భారీ వాహనాలకు ప్రత్యేక ఆంక్షలు విధించగా, వాటికి ఘట్కేసర్ వరకు మాత్రమే అనుమతి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయం పక్కనే ఉన్న వరంగల్, హన్మకొండ, యాదగిరిగుట్ట బస్టాప్‌ను తాత్కాలికంగా నల్లచెరువు కట్ట ప్రాంతానికి మార్చారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలు మేపిల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భగాయత్ లేఅవుట్ మీదుగా నాగోల్ చేరుకోవాలని కోరారు. అక్కడ సర్వీస్ రోడ్డు గుండా వెళ్లి, ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకుని నగరంలోకి ఎంట్రీ అవ్వాల్సి ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వెళ్లే వాహనాలు, సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్, బీరప్పగడ్డ మీదుగా జాతీయ రహదారి 163కి చేరుకోవాలని కోరారు. పీర్జాదిగూడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనదారులు ఉప్పల్ జంక్షన్‌కు రాకుండా, లక్ష్మారెడ్డి కాలనీ మీదుగా ఉప్పల్ మెట్రో స్టేషన్ సమీపంలోని మాస్టర్ చెఫ్ రెస్టారెంట్ వద్దకు చేరుకుని అక్కడ యూటర్న్ తీసుకోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. ఉప్పల్ భగాయత్ రోడ్డు ఇరుకుగా ఉండడంతో భారీ వాహనాలను ఆ మార్గంలో అనుమతించడం లేదు. వాటి కోసం ప్రత్యేక మార్గాలను కేటాయించారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే భారీ వాహనాలు ఘట్కేసర్ వద్దే ఔటర్ రింగ్ రోడ్ ఎక్కి, హయత్‌నగర్ లేదా పెద్ద అంబర్‌పేట మీదుగా ఎల్బీనగర్ చేరుకోవాలని కోరారు. సికింద్రాబాద్, రామంతాపూర్, హబ్సీగూడ నుంచి వరంగల్ వెళ్లే భారీ వాహనాలు నాచారం, మల్లాపూర్, ఐఓసి జంక్షన్, చెంగిచర్ల మీదుగా వరంగల్ హైవేకి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు.



ఉప్పల్ చౌరస్తాలో డివైడర్ ఎక్కి ప్రయాణిస్తున్న వాహనదారులు దృశ్యం.

# నగర జనగణనపై వడదెబ్బ

**- సొమ్మసిల్లుతున్న టీచర్లు**
**- డ్యూటీల మీద డ్యూటీలు**

**చాంద్రాయణగుట్ట, మే 18, ప్రభాతవార్త :** భానుడి భగభగలు నగర జనగణనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దాదాపు 45 డిగ్రీలకు చేరుకుంటున్న ఎండల్లో జనగణన చేయలేక ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు సొమ్మసిల్లి పోతున్నారు. కొందరు వడదెబ్బకు గురై ఆసుపత్రి పాలైతున్నారు. మరి కొందరు బ్రెయిన్ స్ట్రోక్ గురైయ్యారు. మహిళా ఉద్యోగుల పరిస్థితి చెప్పనవసరం లేదు. ఎన్యూమరేటర్లుకు కనీసం చల్లటి మంచి నీరు, మజ్జిగ ప్యాకెట్లను సమకూర్చటం లేదు. జీహెచ్ఎంసి అధికారులు ముందస్తుగా నిర్దేశించిన ప్రాంతాలలో ఇంటింటికి వెళ్ళి ఆ ఇంట్లోని కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు. ఎండకు తట్టుకోలేక ఉదయం సర్వేకు వెళితే బస్తీలు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఆ సమయంలో ఎవరూ పెద్దగా స్పందించటం లేదు. అయితే ఇక్కడ మరో సమస్య వచ్చి పడింది. జూన్‌లో ప్రారంభమైయ్యే సర్ జనగణనపై జనం ఆందోళన పడుతున్నారు. గణకులకు యక్ష ప్రశ్నలు వేస్తున్నారు. ఇది సర్ (ఎస్ఐఆర్) కాదు, జనగణన మాత్రమేనని, దానికి దీనికి సంబంధం లేదని అతికష్టం మీద నచ్చజెప్పాల్సి వస్తుంది. ఈనెల 10 వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్-ఎస్ఇ) జరిగింది. ఆ తరువాత ఈనెల 11 నుండి జూన్ 9వ తేదీ వరకు ఇంటింట జనగణన నిర్వహిస్తున్నారు. ఇందులో మూడు, నాలుగు రోజుల వరకు లేవుట్ మ్యాప్ తయారీకే సరిపోయింది. జీపీఎస్ సరిగా పనిచేయక, బస్తీపేర్లు, బై నెంబర్లు, ఇంటి నెంబర్లు లేక, ఇళ్ళకు తాళం వంటి రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. సూపర్‌వైజర్లు సైతం కొన్ని చోట్ల చేతులెత్తేసే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా పాతబస్తీలో సమస్యలు అధికంగా ఉంటున్నాయి. పాతనగరంలో డ్యూటీ అంటే భయపడే ఉద్యోగులకు కొత్త సమస్యలు తలనొప్పిగా మారుతున్నాయి. జీహెచ్ఎంసి అధికారులు కొందరు వినీ విననట్లు, చూసి చూడనట్లు రోజులు గడిపేస్తున్నారు. జనగణనలో అలసత్వం వహిస్తే ఎక్కడ క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారోనని ప్రభుత్వ ఉద్యోగలు తీవ్ర వత్తిడిలో విధులు నిర్వహిస్తున్నారు. ఎండతీవ్రత, పని వత్తిడి వంటి పలు కారణాలతో మొత్తం మీద జనగణన మందకొడిగా సాగుతుంది.

**డ్యూటీ మీద...డ్యూటీ**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఏప్రిల్ 24న ప్రారంభమైన వేసవి సెలవులు మొదలు టీచర్లకు డ్యూటీ మీద డ్యూటీ వేస్తున్నారు. కేంద్రం జనగణన, సర్, నీట్ చేపట్టగా, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వివిధ పోటీ పరీక్షలు, ప్రస్తుతం జరుగుతున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ (ఇంటర్మీడియట్) వంటివి ఒకదాని వెనుక ఒకటి వస్తున్నాయి. కొన్నిసార్లు రెండు, మూడు డ్యూటీలు ఒకేసారి చేయాల్సి వస్తుంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు మండేకాలంలో డ్యూటీలు చేయాల్సి వస్తుంది. పని బారంతో తీవ్ర వత్తిడికి గురైతున్నారు. దీనికి తోడు బటిబాట పట్టించారు. ఇంటింటికి వెళ్ళి బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలలో చేర్పించే పనిని అప్పగించారు. అంతేకాకుండా దివ్యాంగులైన ఉపాధ్యాయులను వదలటం లేదు. జనగణన డ్యూటీలు అప్పగించారు. ప్రభుత్వ ఉద్యోగులైత ఉద్యోగ భద్రత కోసం భయంతో, సక్రమంగా, సకాలంలో డ్యూటీలు చేస్తారని, విశ్వసనీయమైన పనులను వారికే అప్పగిస్తున్నారు. తద్వారా వరుస డ్యూటీలు వారిని గుక్క తిప్పుకోనివ్వటం లేదు. మానసిక ప్రశాంతత కరువైబారంగా డ్యూటీలు చేస్తున్నారు. ఆ సమయంలో కొన్ని తప్పులు దొర్లే అవకాశం లేకపోలేదు.

## ప్రజావాణి దరఖాస్తులపై సత్వరమే స్పందించాలి

**-హౌసింగ్ పీడీ అశోక్ చక్రవర్తి**



దరఖాస్తులు పరిశీలిస్తున్న పిడి అశోక్‌చక్రవర్తి తదితరులు

**హైదరాబాద్, మే 18,ప్రభాతవార్త:**

ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని హౌసింగ్ పిడి అశోక్ చక్రవర్తి అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఏవో విజయలక్ష్మితో కలసి దరఖాస్తులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రజావాణి లో మొత్తం దరఖాస్తులు 622అందాయని అందులో హౌసింగ్ శాఖ కు సంబంధించి అర్జీలు 520, పింఛన్లు 72, రెవిన్యూ శాఖ 13, అలాగే ఇతర శాఖలు 17 అందాయని తెలిపారు .హైదరాబాద్ సికింద్రాబాద్ రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్నందున ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఓ డాక్టర్ సురేందర్, జిఎం పరిశ్రమలు పవన్ కుమార్, సంక్షేమ అధికారులు జి ఆశన్న, కోటాజి, ప్రవీణ్ కుమార్, ఇలియాస్ అహ్మద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.

## ట్రాఫిక్ ఎసిపిని అభినందించిన కమిషనర్ సజ్జనార్



ఎసిపి కట్టా హరిప్రసాద్‌ను అభినందిస్తున్న కమిషనర్ సజ్జనార్

**జూబ్లీహిల్స్, మే 18, ప్రభాతవార్తః**

జూబ్లీహిల్స్ డివిజన్ ట్రాఫిక్ ఎసిపి కట్టా హరిప్రసాద్‌ను నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్ సోమవారం అభినందించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో మే 8 నుండి 13 వరకు నిర్వహించిన 2వ ఆలిండియా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో మిక్స్‌డ్ డబుల్స్‌లో జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఎసిపి కట్టా హరిప్రసాద్, హుజూరాబాద్ ఎసిపి మాధవి బృందం రజిత పతకం సాధించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం నుంచి రజిత పతకం సాధించినందుకు కమిషనర్ ఆయనను అభినందించారు. కాంస్య పకతాన్ని మరోసారి ఎసిపికి వేసి అభినందించారు. గతేడాది జరిగిన పోటీలోనూ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్య పతకం సాధించినట్లు కమిషనర్ దృష్టికి ఎసిపి తీసుకెళ్లారు. రానున్న నెలల్లో గుజరాత్‌లో జరగనున్న పోటీల్లో బంగారు పతకం సాధించాలని కమిషనర్ ఆయనకు సూచించారు. బంగారు పతకం లక్ష్యంగా కృసి చేయాలన్నారు.

## వార్డుల రిజర్వేషన్లపై అసత్య ప్రచారం

**-ఖండించిన రాష్ట్ర ప్రభుత్వం, జిహెచ్‌ఎంసి**

**హైదరాబాద్, మే 18,ప్రభాతవార్త:**

జీహెచ్‌ఎంసీ, ఇతర మున్సిపల్ ఎన్నికల వార్డులకు సంబంధించి రిజర్వేషన్లపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారం పూర్తి అవాస్తవమని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించేదిగా ఉందని పేర్కొంది. జీహెచ్‌ఎంసీ గానీ, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం గానీ వార్డుల రిజర్వేషన్లకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్చెక్ విభాగం తెలిపింది.ఎన్నికల వార్డుల రిజర్వేషన్ లిస్ట్ ఇంకా ఖరారు కాలేదని స్పష్టం చేసింది.సోషల్ మీడియా లేదా ఇతర ప్లాట్‌ఫాం ప్రచారంలో ఉన్న జాబితాలు, చార్టులు లేదా రిజర్వేషన్ వివరాలు ప్రభుత్వ అధికారిక ప్రకటనలకు ఎలాంటి సంబంధమూ లేదని తెలిపింది. పౌరులు కేవలం రాష్ట్ర ఎన్నికల సంఘం, సంబంధిత అధికారులు విడుదల చేసే నోటిఫికేషన్లను మాత్రమే నమ్మాలని కోరుతున్నట్లు ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

## జనగణన పనుల్లో సమన్వయం పెంచాలి

**: ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి**



వినతులను స్వీకరిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త :** జనగణన కార్యక్రమాన్ని మరింత సమన్వయంతో నిర్వహించి, నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో జనగణన కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన జనగణన కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా కొంతమంది ఎన్యూమరేటర్ల పనితీరు ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీల్డ్ స్థాయిలో సూపర్వైజర్లు, సిబ్బందితో సమన్వయం పెంచి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని కోఆర్డినేటర్లకు సూచించారు. అలాగే అన్ని ఎన్యూమరేటర్లు క్రమం తప్పకుండా ఫీల్డ్ విధులకు హాజరై, నిర్దేశిత విధానంలో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు.

**ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్టాల్ స్థలం కేటాయింపు :**

మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు ప్రాధాన్యత ఇస్తూ తార్నాకలోని ఎంఎంసీ ప్రధాన కార్యాలయం ముందు స్వయం సహాయక సంఘాల మహిళలకు స్టాల్ ఏర్పాటుకు స్థలం కేటాయించినట్లు అధికారులు తెలిపారు. కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా రేణుక అనే మహిళా వ్యాపారి స్వయంగా తయారు చేసిన హోమ్‌మేడ్ ఆహార పదార్థాలు, వివిధ రకాల స్నాక్స్‌ను విక్రయిస్తున్నారు. స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

**ప్రజావాణిలో 24 వినతులు స్వీకరణ :**.ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కూడా కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను ప్రత్యక్షంగా కలిసి వారి సమస్యలు, ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 24 వినతిపత్రాలు అందగా, వాటిని సంబంధిత విభాగాలకు పంపించి తక్షణ చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్పొరేషన్ కట్టుబడి ఉందని, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్


యువన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

**సికింద్రాబాద్, మే 18 ప్రభాతవార్త:**
ఇటీవల సీతాఫలమండీ ప్రాంతంలో దారుణ హత్యకు గురైన యువన్ అలియాస్ అఖిల్ కుటుంబసభ్యులను సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ళ పద్మారావు గౌడ్ పరామర్శించారు. నామలగుండు లోని వారి నివాసానికి వెళ్ళి తల్లిదండ్రులు దుర్గ, శ్రీనివాస్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. హత్య సంఘటన దురదృష్టకరమని, తనను తీవ్రంగా కలచివేసిందని పద్మారావు గౌడ్ తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తామని, నేరానికి పాల్పడిన వారికి తగిన శిక్ష పడేలా కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. పోలీసు అధికారులతో టెలిఫోన్ ద్వారా సంప్రదించి కేసు పురోగతిని ఆరా తీయడంతో పాటు నిందితులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా ఆదేశించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి అన్ని వేళలా తాము అండగా నిలుస్తామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు

## కాంగ్రెస్ పార్టీలో మహిళలకు అధిక ప్రాధాన్యం

**:పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్**


రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి ని అభినందిస్తున్న పిసిసి మాజీ కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, బొల్లు కిషన్

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త**
సీఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సీఎం సలహాదారులు హర వేణుగోపాలరావులు మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పిసిసి మాజీ కార్యదర్శి లక్పతి యాదగిరి గౌడ్ అన్నారు.ఇటీవల తెలంగాణ రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్‌గా నియమితులైన గద్వాల విజయలక్ష్మిను సోమవారం యాదగిరిగౌడ్, పిసిసి ఉపాధ్యక్షుడు బొల్లు కిషన్, మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.మహేష్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం యాదగిరి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సర్కార్ ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం విజయవంతంగా కొనసాగుతుందని అన్నారు.

## బెంగాలీలు అన్ని రంగాలలోను అభివృద్ధి సాధించాలి


చిన్నారులకు పుస్తకాలు,పండ్లు పంపిణీ చేస్తున్న దీపాంకర్ పాల్

**చార్మినార్,మే 18 ప్రభాతవార్త :**
పాతబస్తీలోని బెంగాలీల సమస్యలను పరిష్కరించటానికి అన్ని విధాల పాటు పడుతున్నానని తెలంగాణ బెంగాలీ సమితి అధ్యక్షులు దీపాంకర్ పాల్ అన్నారు.చార్‌మహల్ పెట్లాబూర్జులోని డొంగేర్ సింగ్‌తబేలా ప్రాంతంలో సోమవారం ఆయన బాలికలకు నోట్ పుస్తకాలు,పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతనగరంలోని బెంగాలీలు అన్ని రంగాలలోను మరింత అభివృద్ధి సాధించవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యతోనే మెరుగైన సమాజం,దేశ ప్రగతి సాధ్యం


స్వర్ణలతను సన్మానిస్తున్న సిటీ కళాశాల అధ్యాపకులు

**చార్మినార్,మే 18 ప్రభాతవార్త :** విద్య ద్వారానే మెరుగైన సమాజం నిర్మాణం,దేశ ప్రగతి సాధ్యమవుతుందని ప్రముఖ సంఘ సేవకులు నక్కా శ్రీనివాస్ యాదవ్ అన్నారు.ప్రభుత్వ సిటీ కళాశాలలో జరిగిన విద్యా వారోత్సవాలు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో నిబద్ధతతోకృషి చేసి సిటీ కళాశాలకు దేశంలోనే అత్యున్నత గ్రేడ్ తీసుకురావటంలో అధ్యాపకు లందరూ కృషి చేశారని ఆయన అభినందించారు.విద్యార్థులు ప్రమాదకరమైన వ్యసనాలు బారిన పడకుండ తల్లిదండ్రులు,అధ్యాపకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన తెలిపారు.జాతీయ,అంతర్జాతీయ స్థాయి క్రీడలలో అత్యున్నత ప్రతిభ కనపరిచిన ఇలియాస్,మణి కంఠ,గఫార్,విష్ణు, వంశీ,కళాశాల పూర్వ విద్యార్థినీ ఎం.అపర్ణలను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్వర్ణ ప్రకాష్, స్వర్ణలత,సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.ప్రసాద్,పి.రతన్ కుమార్ డా.కె.పర్వతాలు,డా.ఎల్.తిరుపతి,కళాశాల ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రొ.జె.నీరజ,ప్రొఫెసర్లు శాంతి,శంకర్ కుమార్, రాజంద్రకుమార్,కోయి కోటీశ్వరరావు,నైన వినోదినీ,డా.శ్రీదేవి, డా.శ్రీనివాస్,డా.శారద,డా.శ్రీనివాస్‌రెడ్డి, డా.వాసేదేవరెడ్డి,డా.కృష్ణవేణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## డిప్యూటీ కమిషనర్‌కు బిఆర్ఎస్ వినతి



**పేట్ బషీరాబాద్, మే 18, ప్రభాతవార్త**
ప్రజావాణి కార్యక్రమంలో 132 జీడిమెట్ల డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం డిప్యూ టీ కమిషనర్‌కి వినతి పత్రం అందజేశారు. గాయత్రి నగర్‌లో ఉన్న వార్డ్ కార్యాలయాన్ని ఇటీవల తొలగించ డంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.జీడిమెట్ల గ్రామం, పేట్ బషీరాబాద్ గ్రామం, పరిసర కాలనీల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వార్డ్ కార్యాలయాన్ని యథావిధిగా తిరిగి ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటు కానున్న జీడిమెట్ల మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని జీడిమెట్ల గ్రామంలోనే ఏర్పాటు చేసి ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులోకి తీసుకురా వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు, బచ్చ జ్ఞానేశ్వర్, కాలే నగేష్, సంపత్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, పోగు సమ్మయ్య నేత, కేపీ వినయ్ గౌడ్, నదీమ్ రాయ్, కాలే గణేష్, మస్కూరి పద్మ, యాదగిరి, కవిత పాల్గొన్నారు.

## ట్రేడ్ యూనియన్ల హక్కులను కాలరాస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

**-ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి**


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి. చిత్రంలో ఐఎన్‌టియుసి ఆర్.డి. చంద్రశేఖర్, శ్యాంసుందర్, వెంకటేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త**
వైద్య ఆరోగ్యశాఖలో ఉన్నటువంటి ట్రేడ్ యూనియన్ల హక్కులను ఆ శాఖ ఉన్నతాధికారులు కాలరాస్తున్నట్లు ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం 3194 (ఐఎన్‌టియుసి) ప్రభుత్వ గుర్తింపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆరోపించారు. సోమవారం డిడికాలనీలోని ఆయన నివాసంలో జరిగిన సమావేశంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్, జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్ రెడ్డిలతో కలిసి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బంది అందరూ వర్క్ మెన్ కేటగిరీ కింద ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ యాక్ట్ పరిధిలోకి వస్తారని, కమిషనర్ ఆఫ్ లేబర్ వైద్య ఆరోగ్య శాఖలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిర్వహించి పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ 3194 (ఐఎన్‌టియుసి) సంఘం గుర్తింపు సంఘం ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. అదేవిధంగా అసోసియేషన్ల ఏర్పాటు కొరకు ప్రభుత్వం ఇచ్చిన జీవో 264 ప్రకారం పారామెడికల్ ఉద్యోగులను టీఎన్జీవోలో సభ్యులుగా చేర్చుకోరాదని రోసా రూల్స్ మరియు టీఎన్జీవోల బైలాస్ లో కూడా అదే సూచిస్తుందని అన్నారు. అయినప్పటికీ టీఎన్జీవో నాయకులు వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న పారామెడికల్ ఉద్యోగులకు జరిగే బదిలీలలో ప్రయారిటీ లెటర్లు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం జిపిడి నుండి ఇచ్చిన ఉత్తర్వుల లో గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్‌లను భాగస్వామ్యం చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య ఉద్యోగుల సమ్మె నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. అదేవిధంగా వైద్య ఆరోగ్య శాఖలో పేరుకుపోయిన వివిధ సమస్యలను పరిష్కరించాలని, ఏఎన్ఎంల ప్రమోషన్ల కొరకు నిర్వహించే ఎల్‌హెచ్‌వి ట్రైనింగ్‌ను వెంటనే పునరుద్ధరించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులైన సెకండ్ ఏఎన్ఎంలు ఆర్ఎస్టీ సిపి ఉద్యోగులకు గత మూడు పిఆర్ సి లలో వేతనాలు పెంచలేదని వచ్చే పిఆర్‌సిలో ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల శాలరీలు పెరిగే విధంగా చూడాలన్నారు. ఇటీవల రెగ్యులర్ అయిన ఎంపీహెచ్‌ఏ మగ ఉద్యోగుల ప్రొబేషన్ డిక్లరేషన్ వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ఎం.శ్రీనివాస్, గోవింద్ రెడ్డి,సత్యనారాయణగౌడ్, ప్రకాష్,సుదర్శన్ గౌడ్, రామలక్ష్మి, బీసీ శ్రీనివాస్, కృష్ణమోహన్ గౌడ్ నటరాజ్ రవికుమార్, గుండయ్య,అనిల్ కుమార్, భూషణ్ విజయభాస్కర్, ఆంజనేయులు రామేశ్వరి శ్రీనివాసరావు సుజిత్ గాంధీ, భవాని, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## అధికారులు మారినా.. ఆగని అక్రమ నిర్మాణాలు.

### -కొంపల్లి సర్కిల్‌లో బహిరంగంగా నిబంధనల ఉల్లంఘన..


అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలు

**కొంపల్లి, మే 18, ప్రభాతవార్త**
మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి సర్కిల్ పరిధి దూలపల్లిలో అక్రమ షెడ్ల నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అనుమతులు లేకుండానే భారీ స్థాయిలో నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.ప్రత్యేకంగా మున్సిపల్ కార్యాలయానికి సమీపంలోనే, దూలపల్లి-బహదూర్‌పల్లి ప్రధాన రహదారి పక్కన భారీ షెడ్ల నిర్మాణంలో ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారుల కళ్ల ముందే నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ ఎలాంటి తనిఖీలు లేకపోవడం, నోటీసులు జారీ చేయకపోవడం, నిర్మాణాలను నిలిపివేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై ప్రజలు మండిపడుతున్నారు.ఇటీవల సంబంధిత శాఖలో అధికారుల మార్పులు జరిగినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. కొత్త అధికారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడకపోవడంతో అధికారులు మారినా వ్యవస్థ మారడం లేదా?" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు జరగడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం నష్టపోవడమే కాకుండా పట్టణ ప్రణాళిక నిబంధనలు పూర్తిగా పక్కనపడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడం వెనుక కారణాలేమిటన్నది ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దూలపల్లిలో కొనసాగుతున్న అక్రమ షెడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## అంతరాష్ట్ర దొంగ అరెస్ట్ ... బంగారు అభరణాలు స్వాధీనం

**గోషామహల్,మే18ప్రభాతవార్త:**
దొంగతనం చేసి తప్పించుకు తిరుగుతున్న అంతరాష్ట్ర దొంగనుఅదుపులోకి తీసుకుని సుమారు 30లక్షల విలువైన బంగారు అభరణాలు,రెండు లక్షలపై నగదును స్వాధీనం చేసుకున్నట్లు గోల్కొండ జోన్ డిసిపి చంద్రమోహన్ తెలిపారు.గోషామహల్ ఎసిపికె.చంద్రశేఖరరెడ్డి, బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ భరత్‌కుమార్, డి.ఎస్.కె. జగదీశ్వర రావులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి జి. చంద్రమోహన్ మాట్లాడుతూ మహారాష్ట్ర,లాతూరు జిల్లా ఉద్గీర్ గ్రామానికి చెందిన దివంగత యాదవ్ కుమారుడు సోన్‌కాంబ్లే(20) కిషన్‌బాగ్ పరిసర ప్రాంతాలలో నివాసం ఉంటూ వసనాలకు బానిసై దొంగతనాలను చేయడం మొదలు పెట్టాడు, ఫంక్షన్‌హాళ్లలో జరిగే శుభ కార్యంలో వెయిటర్‌గా పని చేసే వాడు.దీనికి జులాయిగా మారి వచ్చే సంపాదనతో ఖర్చులకు సరిపోక పోవడంతో సులభంగా డబ్బు సంపాదించడానికి దొంగతనాల మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇప్పటి వరకు మూడు ఇండ్లలో దొంగతనం కేసులు,ఒక ఫోక్సో కేసు నమోదైనట్లు డిసిపి చంద్రమోహన్ తెలిపారు.అత్తాపూర్ పి.ఎస్‌లో రెండు కేసులు,బేగంబజార్ పి.ఎస్ పరిధిలో రెండు కేసులు ఉన్నాయి.ఈనెల 6వ తేదిన హిందీనగర్‌లో ఒక ఇంట్లో దొంగ తనం జరిగినట్లు బాధితుడి ఎమ్.కృష్ణ బేగంబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.235 గ్రాముల బంగారం,పదిలక్షల రూపాయల నగదు చోరికి గురైన్నట్లు ఫిర్యాదు పేర్కొన్నాడు. బేగంబజార్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.సిసి కెమోరాల పుటేజీలను పరిశీలించినట్లు చెప్పారు.అనుమానంతో సోన్ కాంబ్లేను అదుపులోకి తీసుకుని విచారించగా తానే దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు చెప్పారు.అతనివద్ద 30లక్షల విలువైన 206 గ్రాముల బంగారు అభరణాలు,2లక్షల14వేల600 రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఈ కేసును గోషామహల్ ఎసిపి.కె.చంద్రశేఖరరెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ భరత్ గౌడ్,ఆద్వర్యంలో డి.ఎస్.ఐ కె.జగదీశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.సకాలంలో కేసు డిటెక్ట్ చేసిన క్రైం సిబ్బందికి క్యాష్ రివార్డు అందచేశారు.

## జన గణనకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి

**- నార్సింగి సర్కిల్ డిసి కృష్ణమోహన్‌రెడ్డి**


అధికారులకు సూచనలు చేస్తున్న డిసి కృష్ణమోహన్‌రెడ్డి.

**నార్సింగి, మే 18 ప్రభాతవార్త :** భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన గణన వివరాల కోసం మీ ఇళ్ల వద్దకు వస్తున్న మా సిబ్బందికి ప్రజలందరూ పూర్తి సహకారం అందించాలని నార్సింగి డి.సి టి.కృష్ణ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నార్సింగి సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో డిసి స్థానిక అధికారులతో కలిసి జన గణనను పరిశీలించారు. జన గణన చేసే విధానంపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల వద్ద ఉన్న సమయం లోనే వెళ్లి పూర్తి వివరాలు సేకరించాలని తెలిపారు. జనాభ గణన చాలా కీలకమైందని, అధికారులు అప్రమత్తంగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. మే 11.నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైందని, సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు, సిబ్బంది సహకరించుకోవాలన్నారు. జన గణనపై ఏ విధమైన అనుమానాలు తలెత్తినా నా దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే ఈ జన గణన ప్రక్రియ విజయవంతం అవుతుందని నార్సింగి డి.సి కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

## మణికొండలో ప్రచార పబ్బం కోసమే వాక్ ఫర్ వాటర్

**నార్సింగి, మే 18 ప్రభాతవార్త :** మణికొండలో ఆదివారం బిఆర్ఎస్ నాయకులు వాక్ ఫర్ వాటర్ కార్యక్రమంతో ప్రచార పబ్బం చేసుకున్నారని కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, శ్రీరాములు ఆరోపించారు. ప్రజల మధ్యన ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని, ఇలా పాదయాత్రలు చేసి ప్రజలను మభ్యపెట్టాలనుకోవడం సిగ్గు చేటన్నారు. నేటి సమాజంలోని ప్రజలు చాలా విజ్ఞులని, ఎవరు తమకు అందుబాటులో ఉన్నారు? ఎవరు తమ సమస్యల పరిష్కారం కోసం పాటు పడుతున్నారు? అన్న విషయాలను ఎప్పటికప్పుడు గమనిస్తూనే ఉన్నారని, అవసరమైన సమయంలో స్టంట్లు చేసే నాయకులకు వాత పెడుతారన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటు పడుతున్న జన నాయకుడు ప్రకాశ్‌గౌడ్‌ను రాజేంద్రనగర్ గడ్డ ప్రజలు వరుసగా నాలుగోసారి తమ నాయకుడిగా, ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని తెలిపారు. ప్రకాశ్‌గౌడ్ వల్లనే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇంటింటికి మంచినీరు సరఫరా అవుతుందని, నేడు స్టంట్లు చేసే నాయకుల వల్ల కాదన్న వాస్తవం ప్రజలకు తెలుసన్నారు. ప్రజల మధ్యన ఉంటూ వారి ఇబ్బందులు దూరం చేసి, ప్రజాభిమానం సంపాదించడంపై దృష్టి పెట్టకుండా ఇలా ఎన్నికల స్టంట్ లు చేసి ప్రజల ముందు నవ్వుల పాలు కావద్దని హితవు పలికారు. నడి వేసవిలో సైతం మణికొండ, నెక్‌నాంపూర్ డివిజన్లలో రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేయిస్తున్న ఘనత ప్రకాశ్‌గౌడ్‌దని, దీన్ని జీర్ణించుకోకుండా బురదజల్లాలనుకోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాలాల నరేష్, ఏర్పుల కుమార్, బషీర్, గంగాధర్, శివగంగ, భరత్‌రెడ్డి, కెపి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ ప్రతిబింబమే సంస్కృతి : పొఫెసర్ ప్రభు


ప్రసంగిస్తున్న కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ కె.ప్రభు

**చిక్కడపల్లి మే 18 ప్రభాతవార్త :** విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" విద్యాసప్తాహంలో భాగంగా కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ కె.ప్రభు అధ్యక్షతన సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు మాట్లాడుతూ విద్య వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన కార్యక్రమాలను కళాశాలలో ఏడు రోజులుగా అధ్యాపకులు, విద్యార్థులు సరియైన ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించారని అభినందించారు.సంస్కృతి సమాజానికి ప్రతిబింబంగా ఉంటుందని, సాంస్కృతిక కళలు సమాజానికి ఆనందాన్ని ఇవ్వడంతో పాటు చైతన్యవంతం కూడా చేస్తాయని తెలియజేశారు. చేసిన శ్రమ బడలికను పోగొట్టి, మనుషులను ఉత్సాహపరుస్తాయని, ఒక సమూహాన్ని గాని సమాజాన్ని ఐక్యంగా ఉంచడానికి ఆ ప్రాంత కళలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు పాటలు, కవితలతో ఆహుతులను అలరించారు.ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ డా. ఆర్.లావణ్య, కల్చరల్ కోఆర్డినేటర్ డా.ముక్తవాణి, ఎన్ సి సి కో ఆర్డినేటర్ శ్రీధర్ రెడ్డి, ఐ క్యూ ఏసీ కోఆర్డినేటర్ డా. పి. పద్మజ, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. అనురాధ, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పాట శక్తివంతమైన ఆయుధం : దాసోజు శ్రవణ్‌కుమార్



నరేందర్ పాలుగులను ఘనంగా సత్కరిస్తున్న శ్రవణ్‌కుమార్, కె.రామాచారి, రమాకాంత్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, మే 18 ప్రభాతవార్త :** పాట ఒక శక్తివంతమైన ఆయుధమని, పాటలో పౌరుషం, పరవశం, ప్రేమ, భక్తి, ఉత్తేజముందని, పాట అద్భుతమైన కళని తెలంగాణ శాసన మండలి సభ్యుడు దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. వేల మాటలకు ఒక్క పాట సరిసమానమని, మొత్తం సమాజానికి దిశదశ నిర్దేశించి ఉత్తేజ చైతన్యపరిచే సాధనం పాట. మనసుకు గాయమైనప్పుడు, సంతోషం కలిగినప్పుడు, నిర్లిప్త మనస్సును తట్టిలేపేదీ పాటని అభివర్ణించారు. ఇలాంటి అద్భుత పాటల కార్యక్రమంతో యువగాయకులకు వేదికనందించి ప్రోత్సహించడం రాజన్ కళాహృదయానికి నిలువెత్తు నిదర్శమని ప్రశంసించారు. తెలంగాణ ఉద్యమం రాష్ట్ర సాధనలో ధూంధాం పేరిట పాటలు తెలంగాణ నలుమూలల నుండి ప్రజల్లో తెచ్చిన ఉత్తేజం, చైతన్యం, ఉగ్రూతలూగించిన వైనవం ఎన్నటికీ మరువలేనిది, మరపురానిదని పాట శక్తిని, దైవత్వాన్ని కొనియాడారు. సమాజంలోని యువతలో దాగివున్న సంగీత సాహిత్య ప్రతిభను వెలికితీసి వేదిక కల్పించి విశేషంగా ప్రోత్సహించడమే తమ సంస్థ ప్రధానలక్ష్యమని సంస్థ అధినేత డా. రాజన్ స్వాగతోపన్యాసంలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో, దాసోజు ఫౌండేషన్, సోలార్ బీట్స్ సహకారంతో, రాజన్ సప్తస్వరాలు సంగీత సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో సోమవారం ఉదయం సుస్వరాల సంగీత నివాళి స్వరాంజలి 2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, గౌరవ అతిథి ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు డా. కె.రామాచారి, దాసోజు గౌరి, న్యాయవాది రమాకాంత్, సంస్థ వ్యవస్థాపకుడు డా. పాలుగుల రాజన్ (నరేందర్), శ్రీదేవి తదితర సంస్థ సభ్యులతో కలిసి సంగీత, సాంస్కృతిక కళారంగాలకు అపూర్వ సేవలందిస్తున్న పలువురు కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. స్వరాంజలిలో గాయకులు ఆలపించిన ఆణిముత్యాల్లాంటి గీతాలు ఆహుతుల్ని తన్మయుల్నిచేసి సంగీతలోకంలో విహరింపజేశాయి.

## ఓయూ పోలీసుల సమయస్ఫూర్తితో ఆత్మహత్యాయత్నం భగ్నం..

### -వ్యక్తి ప్రాణాలు కాపాడిన సిబ్బంది

**తార్నాక, మే 18 ప్రభాతవార్త :** ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనోవేదనకు గురై ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి ప్రాణాలతో కాపాడారు. డయల్100 ద్వారా అందిన అత్యవసర సమాచారంపై నిమిషాల వ్యవధిలో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఈ రెస్క్యూ ఆపరేషన్‌ను విజయవంతం చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి సుమారు 9 గంటల సమయంలో బోరబండకు చెందిన నెలవేణి అనే మహిళ డయల్100కు ఫోన్ చేసి, తన భర్త మల్లేష్ తమ నివాసంలో ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం ఇచ్చారు. ఆర్థిక సమస్యల కారణంగానే అతను ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.ఈ సమాచారాన్ని వెంటనే ఓయూ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మార్గదర్శకత్వంలో సాంకేతిక సహాయంతో మల్లేష్ ఉన్న మానికేశ్వరీ నగర్, స్ట్రీట్ నంబర్7 ప్రాంతాన్ని గుర్తించారు.సమాచారం అందిన వెంటనే బ్లూ కోల్ట్3 (బీసి3) సిబ్బంది పోలీస్ కానిస్టేబుల్ సి. విజయ్ కుమార్ నాయక్ (పిసి 5584), టీజీఎస్పీ కానిస్టేబుల్ తిరుపతి (పిసి 1699) వేగంగా సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు ఇంట్లోకి ప్రవేశించే సమయానికి మల్లేష్ ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించారు. క్షణాల్లో స్పందించిన కానిస్టేబుళ్లు అతడిని సురక్షతంగా కిందకు దించి ప్రాణాలు కాపాడారు.అనంతరం ఓయూ ఇన్‌స్పెక్టర్ ఎం. మహేష్ స్వయంగా బాధితుడికి కౌన్సిలింగ్ నిర్వహించి మానసిక ధైర్యం కల్పించారు. అనంతరం అతడిని కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు.ఆపద సమయంలో వేగంగా స్పందించి ఒక వ్యక్తి ప్రాణాలను కాపాడిన పోలీసు సిబ్బంది సేవలను ఉన్నతాధికారులు, స్థానిక ప్రజలు ప్రత్యేకంగా అభినందించారు.

## అంతర్గత రోడ్ల పునరుద్దరణ పనులు వేగవంతం చేయాలి : మాజీ కార్పోరేటర్ సాగర్‌గౌడ్


డిసి సురేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మాజీ కార్పొరేటర్ సాగర్‌గౌడ్.

**నార్సింగి, మే 18 ప్రభాతవార్త :** బండ్లగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో అంతర్గత రోడ్ల పునరుద్దరణ పనులు వేగవంతం చేయాలని మాజీ కార్పొరేటర్ బి.సాగర్‌గౌడ్ సోమవారం డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డికి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పాలకవర్గం సమయంలో కోట్లాది రూపాయలను వెచ్చించి అన్ని కాలనీలలో మౌళిక వసతులైన అంతర్గత రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, మంచినీటి పైప్‌లైన్, ఓపెన్ జిమ్‌లు, పార్కులు, స్మశాన వాటికలు, పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం చేశామని తెలిపారు. ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్ల పనులు వెంటనే పునరుద్దరించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని డిసిని కోరామని వివరించారు. మా వినతి పత్రంను చదివిన డిసి స్పందిస్తూ వీలైనంత త్వరగా రోడ్ల పనులు పూర్తి అయ్యేలా చూస్తామని హామీనిచ్చారని సాగర్ గౌడ్ తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సాగర్‌గౌడ్‌తో పాటు గణేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి : ఎమ్మెల్యే


విద్యార్థి నిహారికకు సత్కరిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి మే 18 ( ప్రభాతవార్త ) :**
ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్ మండల కేంద్రంలో పదవతరగతి పరీక్షలలో సెయింట్ పయస్ స్కూల్ విద్యార్థిని నిహారిక టాప్ ర్యాంకర్‌గా నిలిచిన సందర్భంగా ఎమ్మెల్యే సత్కరించి అభీహునందించారు. కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ లేదని నిహారిక నిరూపించిందని, నియోజకవర్గంలోని మిగతా విద్యార్థులు కూడా ఆమెను ఆదర్శంగా తీసుకుని చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఇంతటి ప్రతిభ కనబరిచిన విద్యార్థినిని తీర్చిదిద్దిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. నిహారిక భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, ముషీరాబాద్ నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నిహారిక తల్లితండ్రులతో పాటు శంకర్ రావు , రత్నాకర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

## జోన్ చైర్మన్‌గా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ప్రసంగిస్తున్న లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా జోన్ చైర్మన్ పేరి

**చిక్కడపల్లి, మే 18 ( ప్రభాతవార్త ) :**
సమాజ సేవలో నిరంతరం ముందుండే ప్రముఖ సామాజిక కార్యకర్త లయన్ పేరి విజయలక్ష్మి అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 డి జోన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ శతాబ్ది మాజీ అధ్యక్షురాలిగా, గతంలో ఆమె అందించిన విశేష సేవలను, సమర్థవంతమైన నాయకత్వ లక్షణాలను గుర్తించిన సంస్థ ఉన్నతాధికారులు ఈ నూతన బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా పేరి విజయలక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన జిల్లా గవర్నర్ కు, ఇతర సీనియర్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, సేవా విస్తరణకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన భర్త, ప్రముఖ సంఘసేవకులు పేరి నాగేశ్వరరావు 38 సంవత్సరాల సేవా అనుభవం, మార్గదర్శనం ఆమెకు మరింత బలాన్ని ఇచ్చిందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ప్రముఖులు పాల్గొని విజయలక్ష్మి లను అభినందించారు.

## సందర్శకులతో కిక్కిరిసిన సాలార్‌జంగ్ మ్యూజియం

**చార్మినార్,మే 18 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ నయాపూల్ మూసీనది ఒడ్డున ఉన్న సాలార్‌జంగ్ మ్యూజియం సందర్శకులతో కిక్కిరిసి పోయింది.అంతర్జాతీయ మ్యూజియం దినం సందర్భంగా సోమవారం సందర్శకులకుఉచిత ప్రవేశాన్ని కల్పించారు.సోమవారం ఉదయం తొమ్మిది నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకు మ్యూజియంను సందర్శకుల సౌకర్యార్థం తెరిచి ఉంచారు.దాదాపు నాలుగు వేల ఒక వంద మంది పర్యాటకులు సాలార్‌జంగ్ మ్యూజియంను సందర్శించారని మ్యూజియం కీపర్ బి.ఆర్.నాయక్ తెలిపారు.

## సైదాబాద్‌లో ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**సైదాబాద్, మే 18 ప్రభాతవార్త:** ద్విచక్ర వాహనాల దొంగతనానికి పాల్పడుతున్న నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 17వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో సైదాబాద్ డిఐ ఎల్.రవి కుమార్, ఎస్ఐ రాంచంద్రయ్యలు తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న లింగోజిగూడ కామేశ్వర్‌రావు కాలనీకి చెందిన మహ్మద్ జమీల్(19)ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో జమీల్ సైదాబాద్, సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడినట్లుగా నిర్ధారణ అయింది. నిందితుడి నుండి రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో జమీల్‌పై మొత్తం 17 కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**సైదాబాద్, మే 18 ప్రభాతవార్త:**
కాంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రియాసత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అల్తాఫ్ (23) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా డిఎంఆర్ఎల్ చౌరస్తా సమీపంలోని దేవాలయం వద్ద జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. అతివేగం కారణంగానే ప్రమాదం జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. సమీపంలో ఉన్న సిసి పుటేజిలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

## బైక్‌ల దొంగ అరెస్ట్..20 బైక్ లు స్వాధీనం

**వనస్థలిపురం. మే.18.ప్రభాతవార్త**
పార్కింగ్ చేసిన బైక్ లను దొంగిలిస్తూ, తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి, అతని వద్ద నుండి 20 బైక్ లు స్వాధీనం చేసుకొని ,నిందితున్ని రేమండుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సింగరేణి కాలనీలో నివాసముంటున్న కొర్ర దేవ కుమారుడు కొర్ర సంతోష్ (25).మెస్రి పనిచేస్తుంటాడు.కాగా రోజు పనికి పోకుండా మీర్ పేట,వనస్థలిపురం, ఎల్.బి.నగర్ పరిధిలోని ఇంజాపూర్ కమాన్, గుర్రంగుడా క్రాస్ రోడ్,ఎల్.బి.నగర్ మెట్రో స్టేషన్ పార్కింగ్ స్థలాల్లో పార్క్ చేసిన 20 బైక్ లను దొంగిలించాడు. అందులో తన సొంతవూరు దేవరకొండ సమీపంలో నివాసం ఉండే శివ కు 5,మోహన్ కు రెండు బైక్ లను తక్కువ మోతనికే అమ్మాడు. మిగిలిన బైక్ లను సింగరేణి కాలనీలోని తన ఇంటివద్ద దాచిపెట్టి ,తర్వాత అమ్ముదామనుకున్నాడు. ఆదివారం సాయంత్రం వనస్థలిపురం పోలీసులు బి.యన్.రెడ్డి నగర్ లో వాహనాలు తనిఖీ చేస్తుండగా, సంతోష్ ను అనుమానం వచ్చి ,అదుపులోకి తీసుకుని విచారించగా,బైక్ లను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు.నింధితుని వద్ద నుండి 20 బైక్ లను స్వాధీనం చేసుకుని ,సంతోష్ ను సోమవారం రిమాండ్ కు తరలించారు.కాగా 12 బైక్ లపై కేసులు రిజిస్టర్ అయిఉన్నాయ ని,మిగిలిన బైక్ లను విచారణ జరిపి బాధితులకు అందజేస్తామని వనస్థలిపురం ఇన్స్పెక్టర్ రవి బాబు తెలిపారు.

## పంజాగుట్ట 'హనీట్రాప్' కేసులో నిందితురాలు అరెస్ట్

**జూబ్లీహిల్స్, మే 18, ప్రభాతవార్త:**
పంజాగుట్ట హనీట్రాప్ కేసులో నిందితురాలిని పంజాగుట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్ సివిల్ సప్లయిస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సాయికిరణ్‌కు లక్ష్మి అనే మహిళ కార్యాలయంలో విధుల్లో భాగంగా పరిచయమైంది. ఈ క్రమంలోనే సాయికిరణ్‌కు దగ్గరైన ఆమె అతనితో ఏకాంతంగా గడిపిన ఫొటోలను, ఓయో రూమ్‌కు వెళ్లినప్పటి స్లిప్పులను దగ్గర పెట్టుకొని పలు దఫాలుగా బెదిరింపులకు పాల్పడింది. అతని వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేసింది. గత మూడేళ్లుగా అతన్ని పలు రకాలుగా వేధించడమే కాకుండా డబ్బుల వసూలుకు పాల్పడుతుంది. ఈ సంఘటనపై సాయికిరణ్ తాజాగా పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగానే లక్ష్మిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

## కె.కె.కమిటీలో ఉద్యమ సంఘాల నాయకుల పేర్లు ప్రకటించాలి : సుల్తాన్ యాదగిరి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.యాదగిరి తదితరులు

**అడ్డగుట్ట,మే 18 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ కారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని టీయూజేఏసి చైర్మన్ సుల్తాన్ యాదగిరి హెచ్చరించారు. సోమవారం అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన టీయూ జేఏసి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమ కారుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కె.కె.కమిటీలో తెలంగాణ ఉద్యమ కారుల సంఘాల పేర్లను చేర్చాలన్నారు. వచ్చే నెల 2లోపు తెలంగాణ ఉద్యమ కారుల డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు మోత్కూరి మల్లేశ్, జి.యాదగిరి,స్యామ్యేల్, వనజ లక్ష్మి, మణెమ్మ, వెంకట్ లక్ష్మణ్, కమలా, స్వరూప,శ్యామ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత మీ సురక్ష : డిసిపి శ్యామ్ సుందర్


బోయిన్‌పల్లిలో మీ సురక్ష సదస్సులో ప్రసంగిస్తున్న డిసిపి శ్యామ్ సుందర్

**కంటోన్మెంట్,మే 18 ప్రభాతవార్త:** మహిళల భద్రత,రక్షణ కోసం పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని డిసిపి శ్యామ్ సుందర్ తెలిపారు. అదివారం రాత్రి బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన మీ సురక్ష అవగాహన సదస్సుకు అయన ప్రసంగించారు. బోయిన్‌పల్లిలోని సాయి పద్మజా కాలనీలో నిర్వహించిన అవగామన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ పరిధిలో పౌరుల భద్రత కోసం ప్రవేశపెట్టిన కమ్యూనిటీ పోలిసింగ్ మీ సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోకరంగా ఉందన్నారు. అపార్ట్‌మెంట్స్,కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని ఇండ్లల్లో పని చేసే సర్వేంట్‌లు డ్రైవరుల,వాచ్ మెన్‌లు వంట మనుషుల వివరాలను యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీవర్ధన్, కిరణ్ నందిత, విజయకాంత్, కాలనీ ప్రతినిధులు రంగారావ్, తులసీ, సోమెస్,దేవేందర్, మల్లికార్జున్,రవిచంద్ర పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో మెడిటేషన్ మాస్టర్ కుంచపు రమ


మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రమ

**నిజాంపేట్, మే 18, ప్రభాతవార్త**

అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, మెడిటేషన్ మాస్టర్ కుంచపు రమ ఆదివారం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.శ్రీశ్రీశ్రీ వాసవి సేవక్ ఆధ్వర్యంలో వాసవి సేవక్ అధ్యక్షుడు అల్లాడి మహేష్ కుమార్ పిలుపు మేరకు ప్రగతి నగర్ కమాన్ ఎదురుగా ఉన్న మియాపూర్ రోడ్డులో నిర్వహించిన మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు చల్లని మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఇంత మంచి కార్యక్రమానికి ఆహ్వానం పలికిన అల్లాడి మహేష్ కుమార్‌కి, వారి మిత్రబృందానికి కుంచపు రమ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్య క్రమంలో కొలను రాజశేఖర్ రెడ్డి, అగ్రికల్చర్ కమిషన్ సభ్యురాలు భారతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ స్పోక్‌పర్సన్ రమణి, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ రఫీయా, ఓబీసీ జిల్లా కన్వీనర్ బిక్కన్న తదితర కాంగ్రెస్ నాయకులు, ఆర్య సమాజ్ పెద్దలు, సేవా కమిటీ సభ్యు లు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.సేవా కార్యక్రమాల ను నిరంతరం నిర్వహిస్తున్న అల్లాడి మహేష్ కుమార్‌కి దేవుని ఆశీస్సులు, గురువుల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కుంచపు రమ ఆకాంక్షించారు.

## జోనల్ కమిషనర్‌ను కలిసిన విజయా రెడ్డి

**ఖైరతాబాద్, మే 18, (ప్రభాతవార్త):** జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బదావత్ సంతోష్‌ని ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి.విజయ రెడ్డి సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం విజయ రెడ్డి మాట్లాడుతూ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్యం, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, పట్టణాభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు .ఖైరతాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుకైన పాత్ర పోషించాలని ఆమె పేర్కొన్నారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.


బదావత్ సంతోష్‌ను సత్కరిస్తున్న విజయ రెడ్డి

## లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ పత్రాల అందజేత

**సికింద్రాబాద్, మే 18 ప్రభాతవార్త:** పేద ప్రజలకు ప్రయోజనం కలిగించే కార్యక్రమాలకు అత్యధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని, ప్రభుత్వాలు సైతం ప్రజా శ్రేయస్సే పరమావధిగా పని చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం సితాఫలమండీ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా 21 మంది లబ్దిదారులకు సి.ఎం.ఆర్.ఎఫ్. ద్వారా మంజూరైన సుమారు రూ.9 లక్షల విలువజేసే చెక్కులను, ముగ్గురు రోగులకు రూ. 10.25 లక్షల విలువజేసే ఎల్.ఓ.సి. పత్రాలను పద్మారావు గౌడ్ అందించారు. కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు సామలహేమ, శైలజ, బీఆర్ఎస్ నేత రామేశ్వర్‌గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి : రాథోడ్ సంతోష్

**నిజాంపేట్, మే 18, ప్రభాతవార్త**

హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులపై అధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారని, అదే స్థాయిలో కార్మికుల సంక్షేమంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని యూనియన్ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు రాథోడ్ సంతోష్ అన్నారు. సోమవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటీయు) ఆధ్వర్యంలో నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ముందు మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు జీహెచ్ఎంసి స్థాయిలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరు నెలలుగా కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌లో ఉండటంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఏ కార్మికులు, జవాన్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఇల్లు లేని ప్రతి మున్సిపల్ కార్మిక కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ హాజరు విధానంలో మార్పులు చేసి పని ప్రదేశాల వద్దనే ఒక్కసారే హాజరు నమోదు చేసే విధానం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నిజాంపేట్ సర్కిల్ కార్యదర్శి పి. పెంటయ్య, నాయకులు బాలపీర్, మదిలేటి, చెన్నయ్య, అంజి, బాలస్వామి, నాగలక్ష్మి, మనీ, బుజ్జమ్మ, మధు, రాములు, నరసింహ తదితర కార్మికులు పాల్గొన్నారు.


డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## వేతన సవరణ సంఘానికి వినతి పత్రం అందచేసిన టాప్రా బృందం

**ముషీరాబాద్, మే 18, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నియమించిన 8వ వేతన సవరణ సంఘంకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్ర) నేతలు పలు ప్రతిపాదనలతో వినతి పత్రం అందచేశారు. సోమవారం హోటల్ మారియట్‌లో 8వ వేతన సవరణ సంఘం వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టాప్ర ప్రతినిధులు కనీస వేతన 69వేలు చెల్లించాలని, వేతన సవరణ ఫిట్‌మెంట్ 3.833గా ఉండాలని, ఉద్యోగులతో సమానంగా పెన్షన్ రివిజన్ చేయాలని, ఎన్‌పిఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి, పాత డిఫైండ్ పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరారు. ఉద్యోగి చివరి మాస వేతనం, బేసిక్ పేకు 67శాతం సర్వీసు పెన్షన్, 50శాతం కుటుంబ పెన్షన్ మంజూరు చేయాలని, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫారస్ ప్రకారం 65 సంవత్సరాల వయసు నుంచి ప్రతి సంవత్సరం అదనపు పెన్షన్ 5 శాతం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూటెషన్ రెస్టొరేషన్ పిరియడ్‌ని 15 సంవత్సరాలు నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, సీనియర్ సిటిజన్లకు రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్ధరించాలని, 80సంవత్సరాల సూపర్ సీనియర్ సిటిజన్లకు కేర్ టేకర్ అలవెన్స్‌లు మంజూరు చేయాలని, పెన్షనర్ మరణించినప్పుడు అంత్యక్రియల నిమిత్తం 50వేల రూపాయలు చెల్లించాలని కోరుతూ, వేతన సవరణ సంఘం సభ్యులకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో టాప్ర గౌరవ అధ్యక్షులు ఎం.ఎస్.రెడ్డి, సి.జి.కన్వీనర్ రామచంద్రుడు, సభ్యులు ప్రభాకర్, వి.కృష్ణమోహన్, జి.అశోక్, ఎం.అర్జున్, భార్గవాచారి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు

## అభివృద్ధి పనులను పర్యవేక్షించిన దీపిక



**కంటోన్మెంట్,మే 18 ప్రభాతవార్త:** మోండా డివిజన్ నాలా బజార్ అజంతా స్వీట్ హౌజ్ ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా బజార్ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సోమవారం మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జిత్తూ,ప్రశాంత్, రాహుల్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విహెచ్‌కు అభినందన సత్కారం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆమని, భోగరాజు, మహ్మద్ రఫీ

**సైఫాబాద్, మే 18 ప్రభాతవార్త:** తెలుగు భాషా సాంస్కృతిక శాఖ, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆదర్శ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19న మంగళవారం సాయంత్రం రవీంద్రభారతిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావుకు 'అభినందన సత్కారం-సీర్‌వెల్ శృతిలయ జీవన సాఫల్య పురస్కారం-2026' సభ జరుగుతుంది. ఈ సభలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, విహెచ్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని శృతిలయ వ్యవస్థాపక కార్యదర్శి ఆమని, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుసుమ భోగరాజు, అవార్డ్ కమిటీ చైర్మన్ డా.మహ్మద్ రఫీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ సభకు సంబంధించిన బ్రోచర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభలో ముఖ్యఅతిథులుగా రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, విశిష్ట అతిథిగా శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పాల్గొంటారని, సభకు పోలీస్ హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అధ్యక్షత వహిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా సీల్‌వెల్ సినీ సుస్వరాలు-86 జరుగుతాయన్నారు.

## కేంద్రం పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి : మిత్ర కృష్ణ

**కార్వాన్ మే18,ప్రభాతవార్త**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాలనలో అడ్డగోలుగా పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మిత్ర అసోసియేట్ చైర్మన్ మిత్ర కృష్ణ డిమాండ్ చేశారు.మెహిదీపట్నం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలపై అదనంగా మూడు రూపాయలు పెంచడం అత్యంత దుర్మార్గానికి నిదర్శనమన్నారు.ఈ ధరల పెంపును కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ఇప్పటికే ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న సామాన్యుడిపై కేంద్ర ప్రభుత్వం మరోసారి ధరల భారాన్ని మోపిందని మండిపడ్డారు.డీజిల్,పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగి,నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.పెరిగిన ధరల వల్ల సామాన్య,మధ్యతరగతి ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని,నిరుపేద కుటుంబాలు బ్రతికే పరిస్థితి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజల సంక్షేమాన్ని విస్మరించి,ఇలా ధరలు పెంచుకుంటూ పోతే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి,పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని,లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని మిత్ర కృష్ణ హెచ్చరించారు.

## ఇండోర్ స్టేడియం సమస్యలపై వినతి


ప్రజాపాలనలో డిసికి సమస్యలు విన్నవిస్తున్న సతీష్‌గౌడ్

**గన్‌ఫౌండ్రి,మే18ప్రభాతవార్త:** బేగంబజార్ డివిజన్‌లోని విక్టరీప్లే గ్రౌండ్‌ని ఇండోర్ స్టేడియంను ప్రక్షాళన చేయాలని కోరుతూ మహానగర పాలక సంస్థ గోషామహల్ నియోజకవర్గం డిప్యూటీ కమిషనర్‌కు ప్రజా పాలనలో భాగంగా వినతిపత్రం అందచేసినట్లు ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ విన్నవించినట్లు తెలిపారు.ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా వారం సందర్భంగా ప్రక్షాళన చేసిన క్రీడాకారులకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు చెప్పారు.ఈకార్యక్రమంలో సేవాదళ్ నాయకులు ఇష్తేకార్, కమాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.కాగా అర్హులైన వారికి ఇందిరమ్మ పథకంలో భాగంగా డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించాలని హైదరాబాద్ జిల్లా ఆర్.డి.ఓను కలిసి వినతిపత్రం అందచేశారు.

## ఈస్ట్ మారేడ్‌పల్లిలో గుంతల మయంగా రోడ్లు


ఈస్ట్ మారేడ్‌పల్లిలో ప్రమాదకరంగా ఉన్న రోడ్లు

**అడ్డగుట్ట,మే 18 ప్రభాతవార్త:** రైల్ నిలయం అంబేద్కర్ నగర్ నుంచి టీచర్స్ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం చెత్తా,చెదారంతో పాటు గుంతల మయంగా రోడ్లు ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఓవైపు డ్రైనేజీ మురుగునీరు నిరంతరం ఏరులై పారడం,గుంతలమయంగా ఉన్న రోడ్లల్లో మురుగునీరు ప్రవహించడంతో వాహన చోదకులపై చిల్లడం, వాహనాలు ధ్వంశం కావడం,రాకపోకలకు,ట్రాఫిక్‌కు అంతరాయం కలుగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

**డీసెల్టింగ్ మట్టి కుప్పలను తొలగించాలి . . .**

రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో గత 10 రోజుల క్రితం నాలాల్లో పేరుకుపోయిన మట్టిని డీ సెల్టింగ్ చేశారు. మ్యాన్‌హోల్స్ పక్కనే మట్టి కుప్పలను మున్సిపల్ ఇంజనీర్లు తొలగించకపోవడంతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్,ఏఈ వరుణ్ దేవ్‌ల దృష్టికి తెచ్చిన పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.

### తెలంగాణ ఈఏపీసెట్ 2026 టాపర్ రుషికి గవర్నర్ సత్కారం

**జూబ్లీహిల్స్, మే 18, ప్రభాతవార్త:**

తెలంగాణ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ ఈఏపీసెట్) 2026లో మొదటి ర్యాంకు సాధించిన రెసోనెన్స్ జూనియర్ కళాశాలల విద్యార్థిని రుషిని గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల లోక్ భవన్‌లో సత్కరించారు. ఆమె అద్భుత ప్రదర్శనకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కార్మిక సంఘాల ఎన్నికల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం : మొగుళ్ల రాజిరెడ్డి

**హైదరాబాద్,మే 18,ప్రభాతవార్త:** జలమండలి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు జరపాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఐ.ఎన్ టి యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ళ రాజి రెడ్డి అన్నారు. ఈమేరకు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈమేరకు సోమాజిగూడ మంత్రి వివేక్ నివాసంలో కృతజ్ఞతలు తెలిపి శాలువా, పుష్ప గుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జి. వివేక్ వెంకట్ స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తుందని తెలిపారు. మొగుళ్ళ రాజి రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (ఐ.ఎన్. టి యు.సి) సారథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం, జలమండలి యాజమాన్యంతో అనేక సార్లు చేర్చించి దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న దాదాపు అన్ని సమస్యల పరిష్కారం జరిగిందన్నారు. అత్యధిక కార్మికుల సమస్యలను పరిష్కరించిన జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (ఐ.ఎన్. టి యు.సి) ను వచ్చే జలమండలి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో నుఉద్యోగ, కార్మికులు తమ ఓటు ను వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని మొగుళ్ళ రాజి రెడ్డి విజ్ఞప్తి చేసారు. ఈకార్యక్రమంలో బొంతు రామ్మోహన్ తదితరులు ఉన్నారు.



## 20న నగరంలో మెడికల్ షాపులు బంద్

**సైఫాబాద్, మే 18 ప్రభాతవార్త:** ప్రజారోగ్య పరిరక్షణ కోసం, అన్‌లైన్‌లో అక్రమ మందుల వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20 జంట నగరాల్లో 25 వేల మెడికల్ షాప్‌లు బంద్‌లో ఉంటాయని హైదరాబాద్ డిస్టిక్ కెమిస్ట్స్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ తెలిపింది. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి రాగం సంతోష్‌కుమార్, కోశాధికారి మహ్మద్ ఖాజా నజిబుద్దీన్ మాట్లాడుతూ ఈ బంద్‌కు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 20వ తేదీన జంటనగరాల్లోని 25 వేల మెడికల్ షాప్‌లు బంద్‌లో ఉంటాయని, తమకు అపోలో, మెడి ప్లస్, వివిధ ప్రజా సంఘాలు కూడా మద్దతు ఇచ్చాయని చెప్పారు. ఏలాంటి లైసెన్స్ లేకుండా ఆన్‌లైన్‌లో మందుల వ్యాపారం కొనసాగుతున్నదని, ఈ అక్రమ ఫార్మసీలు ప్రజారోగ్యానికి ముప్పుని, భౌతిక ధ్రువీకరణ లేకుండా మందుల విక్రయం జరగడం వల్ల ఒకే ప్రిస్క్రిప్షన్ పలుమార్లు ఉపయోగించే అవకాశం పెరుగుతుందన్నారు. కోవిడ్ కాలంలో జారీ చేసిన తాత్కాలికం నోటిఫికేషన్ జీఎస్ఆర్ 220 (ఇ)ను వెంటనే కేంద్రం ఉపసంహరించుకోవాలని, అలాగే ఈ-ఫార్మసీలకు సంబంధించిన జీఎస్ఆర్ 817 (ఇ) నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేయాలని, కార్పోరేట్ సంస్థల అనైతిక డిస్కౌంట్లను అరికట్టేందుకు 'లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్' విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన జరిగే బంద్‌తో ప్రభుత్వం స్పందించకపోతే ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా నిరవధిక ఆందోళనలకు దిగవలసి వస్తుందని వారు హెచ్చరించారు.



వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే కె.పి వివేకానంద్

**జీడిమెట్ల, మే 18, ప్రభాతవార్త**

మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హాజరయ్యారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని దుండిగల్, నిజాంపేట్, బాచుపల్లి, కైసర్ నగర్‌తో పాటు అన్నీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సీలింగ్, రూఫ్ లీకేజీల కారణంగా నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని, వెంటనే మరమ్మతులు చేపట్టి నివాసయోగ్యమైన వాతావరణాన్ని కల్పించాలని అధికారులను కోరారు.అదేవిధంగా ఆయా ఇళ్ల సముదాయాల్లో నివసిస్తున్న ప్రజల ఆధ్యాత్మిక, సామాజిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రార్థనా మందిరాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూచించారు. అలాగే ప్రజల అవసరాల మేరకు వైకుంఠ ధామాల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు.పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని, పేద ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలను ప్రారంభించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.అదనంగా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు చెత్త సకాలంలో తొలగింపు, కాలనీల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాను నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే అభివృద్ధి చేయాలని అధికారులను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కోరారు.ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పని చేసి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శవంతమైన నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు.


జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద

## రాంగ్‌సైడ్, డేంజరస్ డ్రైవింగ్‌పై ట్రాఫిక్ పోలీసుల ఉక్కుపాదం..

-ఒక్కరోజే 3,142 కేసులు నమోదు..

రూ.38.54 లక్షల జరిమానాలు....

**మల్కాజిగిరి కమిషనరేట్ , మే 18, ప్రభాత వార్త :** రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాలకు ప్రధాన కారణాలుగా మారుతున్న రాంగ్‌సైడ్ డ్రైవింగ్, డేంజరస్ డ్రైవింగ్‌లపై మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు భారీ స్థాయిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీసీపీలు1, 2 పర్యవేక్షణలో, సంబంధిత ఏసీపీల ఆధ్వర్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రధాన కూడళ్ల వద్ద ఈ తనిఖీలు చేపట్టారు.డ్రైవ్ సందర్భంగా మొత్తం 3,142 కేసులు నమోదు చేసి రూ.38,54,700 జరిమానాలు విధించినట్లు పోలీసులు వెల్లడించారు. రాంగ్‌సైడ్‌లో వాహనాలు నడపడం, అనధికార షార్ట్‌కట్లు వినియోగించడం, ప్రమాదకర ఓవర్‌టేకింగ్, అకస్మాత్తుగా లేన్లు మార్చడం, జిగ్‌జాగ్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు.రాంగ్‌సైడ్ డ్రైవింగ్ సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘన కాదని, అది నేరుగా ప్రాణాలకు ముప్పుగా మారుతోందని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. ఇటువంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఎదురెదురుగా ఢీకొనే ప్రమాదాలు, తీవ్ర గాయాలు, మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. కొద్ది నిమిషాల సమయం ఆదా చేసుకోవాలనే ఉద్దేశంతో ప్రాణాలను పణంగా పెట్టవద్దని వాహనదారులకు సూచించారు.వాహనదారులు నిర్దేశిత మార్గాల్లోనే ప్రయాణించాలని, సరైన యూటర్న్‌లను వినియోగించాలని, లేన్ క్రమశిక్షణ పాటించాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు. రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రతి ఉల్లంఘనను అరికట్టడం ద్వారా ఒక ప్రాణాన్ని కాపాడినట్టేనని పేర్కొన్నారు. ఇటువంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి సమస్యలు


నీటి సరఫరాను పరిశీలిస్తున్న నాయకులు

**జీడిమెట్ల, మే 18, ప్రభాతవార్త**

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప పోచమ్మ దేవాలయం వద్ద త్రాగునీటి పైపుకు రంధ్రం పడటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు, వాటర్ డిపార్ట్మెంట్ మధ్య సమన్వయం లోపం కారణంగా నీటి సరఫరా నిలిచిపోయిందని ఆరోపిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల సామాన్య ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రజలకు నీటి సరఫరా అందించాల్సిన వాటర్ డిపార్ట్మెంట్ అధికారులు, రోడ్లు, ఇతర మౌలిక వసతుల పనులు చేపట్టే మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం దురదృష్టకరమని అన్నారు.క రోజు నీటి సరఫరా నిలిచిపోయినా ప్రజల నుంచి పూర్తి నెల బిల్లులు వసూలు చేస్తున్నారని, మరి నీళ్లు రాని రోజుకు బిల్లులో కోత విధిస్తారా అని ప్రశ్నించారు. పైపులైన్ పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, లైసెన్సును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I ASGARI KHANAM W/o MIR MASUD ALI R/o. 12-2-800/441/6, DILSHAD NAGAR, MEHDIPATNAM, HYD-500028 CHANGED MY NAME TO NAHEED ALI FOR ALL FUTURE PURPOSES.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**PUBLIC NOTICE**

Public is notified that my client has agreed to purchase All that Flat No.G-2, on Ground Floor in the complex known as "Sri Ram Nivas" in H.No.3-4-462/2, admeasuring 1000 square feet along with undivided share of land admeasuring 40 square yards or equivalent to 33.44 square meters, situated at Narayanguda, Hyderabad and bounded on North by Open to Sky, on South by Staircase, on East by Open to Sky, and on West by Open to Sky ("the Said Property"), from its owner Shri Surender Reddy @ Surender Chandupatla Reddy S/o Shri C. Ram Reddy, aged about 71 years, Occupation: Business, R/o 4240 S AUTUMN RIDGE CT SAGINAW, MI 48603-8664 USA, who has assured my client that he has clear and marketable title over the Said Property and the same is free from all encumbrances, liens, mortgages, third party interests, claims, etc. of whatsoever nature.

Any person / entity claiming any right, title or interest over the Said Property is requested to contact the undersigned with all original documents within 7 (Seven) days of this publication. Any claim raised after 7 (Seven) days of this publication shall not be entertained and the Sale transaction will be completed.

Place: Hyderabad
Date: 18.05.2026

Sd/- RAVINDER SHARMA
ADVOCATE
#207, Mahaveer Apartments,
3-5-796, Basheerbagh-King Koti Road,
Hyderabad-500029
Ph: 9848933649; 8919849107

IN THE COURT THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT: RAJENDERNAGAR
O.S.NO. 206 OF 2026
BETWEEN:
U.ESHWARAMMA And two others ...PLAINTIFFS
AND
THE TAHSILDAR, Rajendranagar Mandal, Ranga Reddy Dist 500030, And others ...DEFENDANTS
D-3 ALL CONCERNED

**PUBLIC NOTICE**

The Plaintiffs had filed the above suit for Declaration to Declare the Plaintiffs as Legal Heirs of deceased Uputur Yalamanda in respect of ½ undivided share in H.No.6-10-26/1/B/2/1 on Plot bearing No.39/A admeasuring 40 sq.yds or 33.44 sq.mts out of 80sq.yds in Sy.No.26/A, situated at Katedhan (Shivarampally Village), Rajendra nagar Mandal, Ranga Reddy District and bounded on North: Neighbours Plot, South: 18 Feet Wide Road, East: Plot No.39/B, West: 20 Feet Wide Road against the Defendants which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 09.06.2026 at 10.30 a.m. Therefore, you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law.

(BY ORDER OF THE COURT)
Sd/- K.SATYANARAYANA GOUD
Advocate,
H.No.1-3-33, Budwel,
Rajendranagar Mandal
Ranga Reddy District.

తెలంగాణ ప్రభుత్వం
**సైబరాబాద్ మహానగర పాలక సంస్థ**
EE II/56-కొంపల్లి 59-దుండిగల్ & 60-మేడ్చల్/కుత్బుల్లాపూర్ జోన్

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

NIT No.06/EE-56/QBZ/CMC/2026-27, NIT No. 04/EE-59/QBZ/CMC/2026-27 & NIT No. 05/EE-60/QBZ/CMC/2026-27, తేది: 18.05.2026 ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ప్రచురింపబడింది, వివరాలను https://tender.eprocurement.gov.in. వద్ద లాగింగ్ ద్వారా చూడవచ్చును. తేదీల వివరాలు ఈ క్రింద వివరింపబడినవి.

నిట్ నం.లు పైన పేర్కొన్నవి. పని పేరు: 1) BT, CC రోడ్స్ నిర్వహణ మరియు వరద నీటి కాల్వలు-1 పని, 2) మరుగుదొడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు-2 పనులు, 3) BT రోడ్ వేయుట-1 పని. 1) BT, CC రోడ్స్ నిర్వహణ మరియు వరద నీటి కాల్వలు-1 పని, 2) మరుగుదొడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు-2 పనులు, 3) LED డ్రైవర్ సేకరణ-1 పని, 4) PSCC స్తంభాల ఏర్పాటు-1 పని, 5) చైన్ లింక్ మెష్ వేయుట-1 పని. 1) వీధి దీపాల నిర్వహణకు LED లైట్లు, కేబుల్స్ యొక్క సేకరణ-1 పని. అంచనా మొత్తం: (లక్షలలో) 50.30, 17.47, 32.50. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం/బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: క్ర.సం.1 & 2 పనులకు 19.05.2026 మ.12.00 గం. నుండి 22.05.2026 మ.12.00 గం. వరకు.

క్ర.సం.1 నుండి 3 పనులకు, క్ర.సం.4 నుండి 5 పని కొరకు, క్ర.సం.1 పనికి - అన్ని పనులకు డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ, సమయం, బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: పైన పేర్కొన్న తేదీలు, సమయాలు ఆవే. అధికారి పేరు & చిరునామా, సెల్ నం.: EE, సర్కిల్-56, 59 & 60, CMC, కుత్బుల్లాపూర్, సెల్ నం: 7995468066 / 7331181426.

సంబంధిత అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 56-కొంపల్లి, 59-దుండిగల్ & 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, CMC.

తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-56, 59 & 60, QBZ, CMC

DIPR.No.2585-PP/CL/Advt/1/2026-27, తేది: 18.05.2026

## నాగిరెడ్డి కాలనీ అభివృద్ధికి కృషి : మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న నాగిరెడ్డి కాలనీ నూతన కమిటీ ప్రతినిధులు

**వనస్థలిపురం మే.18.ప్రభాతవార్త**

బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని నాగిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీ ఏర్పరచుకున్న సందర్భంగా నిర్వహించిన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి గారు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరడం జరిగింది.స్పందించిన లచ్చి రెడ్డి గారు ఒకటొకటిగా కాలనీలోని ప్రతి అభివృద్ధి మరియు సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు పద్మా పూల్ సింగ్, అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు సి.హెచ్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సోమయాజులు, జాయింట్ సెక్రెటరీ సతీష్, పావని కిరణ్, ట్రెజరర్ పద్మావతి, అడ్వైజర్స్ రఘునాథ్, సాయి ప్రసాద్ రెడ్డి, కల్చరల్ సెక్రటరీ హరికృష్ణ, వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు రాంబాబు, నవీన్ కుమార్, ముకుంద, నాగరాజు, మంజుష, లీలావతి మరియు కాలనీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి: ఎస్ఇ శ్రీనివాస్



మలక్ పేట్‌లో డెంగ్యూ వ్యాధి నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఇ నామాల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, మే 18, ప్రభాతవార్త:**

జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవం సందర్భంగా జీ హెచ్ యం సీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం, యూపీహెచ్‌సీ జాంబాగ్, మలక్‌పేట్ యశోద హాస్పిటల్, ఆశా వర్కర్లు, ఎస్‌యూ యూనిట్ అధికారులు, ఎంఎస్‌యూ టీమ్ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో మలక్ పేట్ నల్గొండ చౌరస్తా వద్ద డెంగ్యూ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.మలక్ పేట ప్రాంతంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలకు డెంగ్యూ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీ హెచ్ యం సీ చార్మినార్ జోన్ మలేరియా విభాగం ఎస్ఇ నామాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని, దోమల పెరుగుదలను అరికట్టాలని సూచించారు. ప్రజల సహకారంతోనే డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు బాలకృష్ణ, శిల్పరెడ్డి, ధనలక్ష్మి,మలేరియా మలక్ పేట్ సర్కిల్ ఎంటామాలజి సూపర్వైజర్ శివకుమార్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎంటమాలజీ సిబ్బంది, పాల్గొన్నారు.

## బోర్‌బావి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయాలని వినతి



**నేరెడ్ మెట్ , మే 18, ప్రభాతవార్త :**

బగత్‌సింగ్‌నగర్ కాలనీలోని బోర్‌బావికి విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు బి ఆర్ ఎస్ నాయకులు తుపాకుల జనార్దన్, కోటేశ్వరరావు లు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానికులతో కలిసి విద్యుత్ శాఖ ఏఈ సుమతి కృష్ణను కలిసి వినతిపత్రం సమర్పించారు.కాలనీలోని బోర్‌బావి కొంతకాలంగా విద్యుత్ మీటర్ లేకపోవడంతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని, దీనివల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలు అధికమయ్యాయని, వెంటనే కొత్త విద్యుత్ మీటర్ మంజూరు చేసి బోర్‌బావిని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు.కార్యక్రమంలో కాలనీవాసులు లింగమయ్య, కృష్ణమూర్తి, దేవప్రసాద్, శ్రీధర్, వేణు, శ్రీకాంత్, దాస్, ప్రదీప్ పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుపాకుల జనార్దన్, హరి కోటేష్, టీ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు

## మీ సురక్షకు విశేష స్పందన : ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్




**నేరేడ్‌మెట్, మే 18 ప్రభాతవార్త:**

ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆధ్వర్యంలో చేపట్టిన మీ సురక్ష కార్యక్ర మానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్లు నేరేడ్‌మె ట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ తెలిపారు. ఇటీవల నగర పరిధిలో చోటుచేసుకుంటున్న దొంగతనాలు, మోసాలు, అనుమానాస్పద ఘట నల నేపథ్యంలో ప్రతి ఇంటి వద్ద పనిచేసే వ్యక్తుల పూర్తి వివరాలు నమోదు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.ఇంటి పనివాళ్లు, డ్రైవర్లు, కేర్‌టేకర్లు, వాచ్‌మెన్‌లు, సెక్యూరిటీ గార్డులు, వంటవాళ్లు, కిరాయిదారులు తదితరుల వివరాలను"మీ సురక్ష గూగుల్ ఫారం లేదా క్యూఆర్ కోడ్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూ చించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రతి వ్యక్తి వివరాలు పోలీసుల డేటా బేస్‌లో క్రమబద్ధంగా నమోదు కావడంతో నేరాల నియంత్రణకు, అనుమానాస్పద వ్యక్తుల గుర్తింపుకు ఉపయోగపడుతుందని తెలిపా రు.ఇప్పటికే కాలనీలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులకు క్యూఆర్ కోడ్‌లు, గూగుల్ ఫారం లింక్‌లు అందజేసినట్లు చెప్పారు. ఇంకా నమోదు చేసుకోని వారు వెంటనే తమ వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా పోలీస్ స్టేషన్ లో ప్రత్యేక రిసెప్షన్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాలు కాలనీలు, అపార్ట్‌మెంట్‌లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని వెల్లడించారు.ప్రజల సహకారంతోనే భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి"మీ సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

## ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి : ఆర్. కృష్ణయ్య

**మలక్ పేట, మే 18, ప్రభాతవార్త:**

ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. దిల్ షుక్ నగర్ లో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గంజి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 18 పోస్టులు, 30 వేల టీచర్ పోస్టులు, ఎన్నికల వాగ్దానం ప్రకారం అన్ని రంగాలలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రధాన కారణం నిరుద్యోగ పోరాటమేనని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను నిర్లక్ష్యం చేసినందుకే వారి ఆగ్రహాన్ని గురై ఓటమి పాలైందని తెలిపారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రతి ఎన్నికల ప్రచారంలో ఉద్యోగాలు భర్తీ చేస్తామని విస్తృత ప్రచారం చేసి నిరుద్యోగులను నమ్మించారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో పాఠశాలలో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారని, టీచర్లు లేకుండా పాఠశాలలో



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, చిత్రంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ తదితరులు

విద్యార్థులకు బోధన ఎలా చేస్తారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రైవేటు రంగం, ఐటి తదితర ఉద్యోగాలతో పాటు ప్రభుత్వ శాఖలలో ముఖ్యంగా విద్యా, వైద్యం, రెవిన్యూ, పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగాలను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని కోరారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకపోతే ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, నాయకులు వై. నాగేశ్వరరావు, నూకాలమ్మ, జిల్లపల్లి అంజి, రాజేందర్, అనంతయ్య, పగిల్ల సతీష్, శివకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలో భారీ భూ కుంభకోణం..రూ. 6 లక్షల కోట్ల అవినీతి

**-హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ ఆరోపణలు**

**మలక్ పేట, మే 18,ప్రభాతవార్త:**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న భారీ భూ కుంభకోణం పై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు, నిఘా, దర్యాప్తు సంస్థలు విచారణ జరిపించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో కొందరు ఉన్నతాధికారులు చక్రం తిప్పి ఆరు లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం ఆస్మాన్ ఘడ్ డివిజన్ కళ్యాణ్ నగర్ లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు.మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్ పల్లి శివారులోని సర్వే నెంబర్లు 627, 629, 1011, 1012, 1013 నుంచి 1023 1031 1032 లోని 458 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండేదని వివరించారు. 2022 2023 సంవత్సరాలలో జిల్లాకు ఉన్నతాధికారులుగా వ్యవహరించిన కొందరు అధికారులు ఆ భూములను పలు సంస్థలకు ఒక ఎకరం కేవలం 1000 రూపాయలకు చొప్పున ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు నేరుగా ఆ



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ తదితరులు

యా సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయించారని, రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంప్స్ చార్జెస్ కూడా మినహాయించారని ఆయన వివరించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థలకు ఉన్నత స్థాయి అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆ భూముల విలువ ఆరు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని ఆయన అన్నారు. ఇంతటి భారీ భూకంభకోణంపై ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఆర్టిఐ సహాయంతో తాము సేకరించిన వివరాలతో న్యాయపోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## అరుదైన పెల్విక్ ట్యూమర్‌ను తొలగించి యువకుడికి కొత్త జీవితం

**నేరెడ్ మెట్, మే 18,ప్రభాతవార్త :**

పదేళ్లుగా శరీరంలో పెరుగుతున్న భారీ కణితితో నిత్యజీవితం నరకప్రాయంగా మారిన ఓ యువకుడికి సైనిక్‌పురిలోని ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్ వైద్యులు కొత్త ఆశ నింపారు. 32 ఏళ్ల యువకుడు దాదాపు పదేళ్లుగా పెల్విక్ ప్రాంతంలో పెరుగుతున్న భారీ కణితితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. కాలక్రమేణా కణితి పరిమాణం 20 సెం.మీ 30 సెం.మీ వరకు పెరగడంతో నడవడం, కూర్చోవడం కూడా కష్టమైంది. వైద్య పరీక్షల్లో అది ఆస్టియోకాండ్రోమా"గా నిర్ధారణ కాగా, భవిష్యత్తులో కాండ్రోసార్కోమా"గా మారే ప్రమాద సూచనలు కనిపించాయి.పలువురు వైద్యులు ప్రమాద స్థాయి ఎక్కువగా ఉందని వెనక్కి తగ్గగా, భారీ చికిత్స ఖర్చులు కుటుంబాన్ని మరింత ఆందోళనకు గురిచేశాయి. చివరకు ఆర్థోపెడిక్ ట్యూమర్ కేసుల్లో నైపుణ్యం కలిగిన డాక్టర్ వి.ఎస్. అభిలాష్ కుమార్‌ను సంప్రదించారు.సాహసోపేత శస్త్రచికిత్సగ్గి పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించిన వైద్య బృందం ప్రత్యేక చికిత్సా ప్రణాళిక రూపొందించింది. డాక్టర్ వి.ఎస్. అభిలాష్ కుమార్ నేతృత్వంలో డాక్టర్ ఉదయ్ శేఖర్ రెడ్డి, డాక్టర్ మనోజ్ పుడారి, డాక్టర్ సాయి కార్తికేయ బద్రి, డాక్టర్ సాయి కృష్ణ సి.ఎస్.ల బృందం "వైడ్ లోకల్ ఎక్సిషన్" విధానంలో శస్త్రచికిత్స నిర్వహించి కణితిని పూర్తిగా తొలగించారు. గంటల తరబడి సాగిన ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా




పూర్తి చేసి రోగికి ఉపశమనం కలిగించారు.అనస్థీషియా, క్రిటికల్ కేర్ విభాగాన్ని డాక్టర్ లక్ష్మీ కుమార్ జస్తి సమర్థవంతంగా నిర్వహించగా, శస్త్రచికిత్స అనంతరం ఐసీయూ సంరక్షణను డాక్టర్ గౌతమ్ రెడ్డి పర్యవేక్షించారు. డాక్టర్ శ్రీరామ్ ఎల్ ఆధ్వర్యంలో పునరావాస చికిత్స ప్రారంభించడంతో రోగి కోలుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.సేవాభావానికి నిదర్శనంఅత్యంత ఖరీదైన చికిత్స అవసరమైన ఈ కేసును వైద్యులు అందుబాటు వ్యయంతో పూర్తి చేయడం కుటుంబానికి పెద్ద ఊరటనిచ్చింది.మా పరిస్థితిని అర్థం చేసుకుని వైద్యులు మాకు ధైర్యం చెప్పారు.. ఇప్పుడు మా కుమారుడు మళ్లీ సాధారణ జీవితంలోకి వస్తున్నాడు" అంటూ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.అరుదైన కేసులను కూడా ధైర్యంగా స్వీకరిస్తూ వైద్య సేవలను మానవత్వంతో అందిస్తున్న ప్యూర్ ఆర్థో హాస్పిటల్స్ వైద్య బృందంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఘనంగా బీరప్పస్వామి, కామరాతిదేవి కళ్యాణోత్సవం

**రామంతాపూర్, మే 18 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని బీరప్ప దేవాలయంలో శ్రీ బీరప్పస్వామి, కామరాతిదేవి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయం చైర్మన్ శాగ రవీందర్, ఉప్పల్ జోన్ అధ్యక్షుడు రేవు కృష్ణయ్య, దేవాలయ కమిటి సభ్యులు రావుల బీరప్ప, కార్యదర్శి బలం బిక్షపతి, సంఘం అధ్యక్షుడు రావుల జంగయ్య, సభ్యులు కవిడే యాదయ్య, పల్లారి మల్లయ్య, శాగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ఉదయం స్వామి వారి కళ్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం గొర్ల మంద మీద సరుగు వేయుట, గొర్రె పోట్టేలును తీసుకునిపోవడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 19వ తేదిన రేణుక ఎల్లమ్మ దేవి, పరుశరాముడి వేషాలతో ఒగ్గుకథ, గారడి వేషం ఉంటుందని, 20నబీరప్పస్వామి, కామరాతిదేవి, అక్క మహాకాళమ్మ, బొగన్న వేశాలతో నాగవెల్లి జరుపుట, సాయంత్రం గొర్ల కళ్యాణం, సల్ల పోయుట, అక్క మహం



బీరప్ప కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాళమ్మ, కామరాతిదేవికి ఒడి బియ్యం పోయుట, 21న బయ్యన్న పూజ, తొక్కుడు మైలలు, శంకు తీర్థం, పదార్ పండుగ నిర్వహిస్తామని నిర్వహకులు తెలిపారు. కాగా సోమవారం ఉదయం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, నేతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ ప్రాంత ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తమ వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాలమ్మ విగ్రహ పునః ప్రతిష్టాపనోత్సవాలు

### హాజరైన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రాంచందర్‌రావు

**సరూర్‌నగర్, మే 18 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెలగూడ కమలానెహ్రూనగర్ కాలనీలో ముత్యాలమ్మ విగ్రహ పునః ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్టాపన జరిగిన అమ్మవారి దేవాలయంలో శాంతి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అయితే ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లెలగూడ మాజీ ఉప సర్పంచ్, సీనియర్ నాయకుడు మేకల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపిన తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, జాతీయ బిసి కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ తదితరులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మేకల విజయలక్ష్మి, కీసర గోవర్ధన్‌రెడ్డి, కొండ్రు గౌరి శంకర్, మీర్‌పేట్ సెక్టార్ 2 బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్, నాయకులు సూల ప్రభాకర్, గడ్డం జగన్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, గాజుల మధు, వంటేరు నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వలభోజు గోపినాథ్,తదితరులు పాల్గొన్నారు.



రాంచందర్‌రావును సన్మానించిన మాజీ ఉప సర్పంచ్ మేకల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల విజయలక్ష్మి తదితరులు

## ముత్యాలమ్మ శాంతి కళ్యాణోత్సవంలో తీగల విక్రంరెడ్డి పూజలు



శాంతి కళ్యాణానికి హాజరైన మీర్‌పేట్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, మే 18 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిహెచ్ఎంసి మీర్‌పేట్ డివిజన్-60లోనున్న జిల్లెలగూడ కమలా నెహ్రూనగర్ ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన శాంతి కళ్యాణానికి హాజరైన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అదే విధంగా బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ యాదవ్, ధనలక్ష్మి రాజ్‌కుమార్, కాంటెస్టెడ్ కార్పొరేటర్లు అబ్బనమోని గోపియాదవ్, బొమ్మకంటి దయానంద్ ముదిరాజ్ తదితరులు కూడా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సరూర్‌నగర్ చెరువు పరిరక్షణ కోసం 3కె రన్




3కె రన్‌లో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్లు, టిపిసిసి అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, సినీ నటి పాయల్ తదితరులు

**సైదాబాద్, మే 18 ప్రభాతవార్త:** టిపిసిసి అధికార ప్రతినిధి దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రన్ ఫర్ రెనోవేషన్ ఆఫ్ సరూర్‌నగర్ లేక్ పేరుతో 3కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రూ.24 కోట్లతో చెరువు పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. హైడ్రా సహకారంతో మరో రూ.88 కోట్ల అభివృద్ధి పనులకు ఆమోద ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని సరూర్‌నగర్ చెరువును ప్రజా ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని అన్నారు. లేక్ వ్యూ పాయింట్ నుండి ప్రారంభమైన 3కె రన్ చెరువు చుట్టూ తిరిగి ప్రియదర్శిని పార్కు వద్ద ముగిసింది. 3కె రన్‌కు ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎల్‌బినగర్ జోనల్ కమీషనర్ వికాస్ మోటో, ఎల్‌బినగర్ ఎసిపి కృష్ణయ్య, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, కల్వ సుజాత, అన్వేష్‌రెడ్డి, నల్గొండ గద్దర్ నరసన్న, సిని నటి పాయల్ రాధా కృష్ణలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



సిఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, మే 18 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ కటికోనికుంటలో నివాసం ఉంటున్న అశోక్, భాగ్యల కుమారుడు అద్వైత్ పుట్టుకతోనే వినికిడి, మాటలు రాకపోవడం సమస్యలతో బాధపడుతున్నాడు. వారి ఆర్థిక పరిస్థితులు బాగలేకపోవడంతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి సహాయం చేయాల్సిందిగా కోరడంతో, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వారిచేత సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ క్రమంలో సిఎం రిలీఫ్‌ఫండ్ నుండి మంజూరైన రూ.6 లక్షల ఎల్‌ఓసి చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని అన్నారు. పేద ప్రజలు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలు పొందడానికి సిఎం సహాయనిధి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్‌వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, విద్యాసాగర్, సుభాష్, విజయ్, గోవింద్ పాల్గొన్నారు.

## శ్రీశ్రీనగర్ కాలనీలో సిసి రోడ్డు పనులు



ఉప్పల్ శ్రీశ్రీనగర్ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ కార్పొరేటర్ మందముల రజితరెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ శ్రీశ్రీనగర్ కాలనీలో రూ.90లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం మాజీ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు కాలనీవాసుల సమస్య పరిష్కరించినట్లు తెలిపారు. కాలనీలో మౌళిక సదుపాయాల కల్పనకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మున్సిపల్ అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులు ప్రారంభిచామని, కాలనీవాసులు తమ సమస్యలను తమ దృష్టికి తీసుకుని రావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ నేతలు ఎస్.నాగరాజు,ఎ.కిషోర్ కుమార్, ఎం.భరత్ రాజ్ గౌడ్, వై. సుధాకర్‌రావు, అప్పన శ్రీనివాస్, ఎం.గిరి బాబు, డా. ప్రవీణ్, వైఎస్ఎన్ మూర్తి, మల్లికార్జున రావు, మల్లా రెడ్డి, సత్యన్, పి.సత్యనారాయణ, శంకర్ గౌడ్, అరురు పల్లవి, అప్పన వెంకట కుమారి, హరి కుమారి, రాధ, స్వరూప, శోభ, అనంత పద్మ, జయమ్మ, వీరమణి పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## హైదరాబాదు బిజెపి మాజీ అధ్యక్షుడు జిఆర్ కరుణాకర్ మృతి



జి ఆర్ కరుణాకర్ మృతదేహానికి నివాళులర్పిస్తూ రామచందర్ రావు

**తుర్కయంజాల్ మే18, ప్రభాతవార్త**

ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలో లక్ష్మీ మేఘ టౌన్ షిప్ రాగన్నగూడ జిఆర్ కరుణాకర్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ..రాత్రి 11:30 గంటలకు గుండెపోటుతోని పరమదించాడు. కరుణాకర్ మరణించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన నివాసానికి వచ్చేసి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంచి నాయకుని కోల్పోవడం చాలా బాధాకర విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, జాతీయ బిసి కమిషన్ మాజీ మెంబర్ కల్లోజు ఆచారి, బిజెపి జిల్లా కార్యదర్శి నారాయణ యాదవ్, బొక్క నరసింహారెడ్డి, పో రెడ్డి నరసింహారెడ్డి, బారు శ్రీనివాసరావు( అలియాస్ బొగ్గు శీను), రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్ , ప్రకాష్ రెడ్డి , సామ రంగారెడ్డి, , బిజెపి రాష్ట్ర నాయకులు బచ్చి గళ్ళ రమేష్ , కొండ్రు పురుషోత్తం, నోముల కార్తీక్ గౌడ్,మల్లెల ప్రేమ్ సాయి , రాంరెడ్డి , నక్క బోయిన ఆంజనేయులు, ఎప్పి రావు, సామల మహేష్, మన్నె కొండల యాదవ్, సందీప్ రెడ్డి,దార వెంకటేష్ , మరియు బిజెపి నాయకులు సీనియర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ కేసరి విజేత అబూబకర్‌కు ఘన సన్మానం



**సరూర్‌నగర్, మే 18 ప్రభాతవార్త:** ప్రతిష్టాత్మక కుస్తీ పోటీల్లో తెలంగాణ కేసరి విజేతగా నిలిచిన అబూబకర్ బామస్‌ను బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోని ఫిట్నెస్ ఫ్రీక్ లో ఘనంగా సన్మానించారు. పాతబస్తీ బార్కాస్ ప్రాంతానికి చెందిన అబూ బకర్ ఇక్కడి ఫిట్నెస్ ఫ్రీక్‌లో గత కొన్నేళ్ళ నుండి సాధన చేస్తూ ఈ నెల 7వ తేదీ నుండి 10వ తేదీ వరకు తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో జరిగిన తెలంగాణ కేసరి కుస్తీ పోటీల్లో పాల్గొన్నారు. అయితే పోటీల్లో సత్తా చాటిన అబూబకర్ ప్రత్యర్థులను మట్టి కరిపించి ప్రతిష్టాత్మక తెలంగాణ కేసరి టైటిల్‌తో పాటు హనుమాన్ గద, రూ.3 లక్షల నగదును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అందుకున్నారు. ఈ నేపథ్యంలో బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోని ఫిట్నెస్ ఫ్రీక్‌లో అబూబకర్‌ను జిమ్ యజమాని కందాడ శ్రీశైలంరెడ్డి, బడంగ్‌పేట్ సర్కిల్ ఛత్రపతి శివాజీ ఉత్సవ సమితి అధ్యక్షుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత మత్తుకు బానిసలు కాకుండా శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని పిలుపునిచ్చారు. జీవన శైలిలో వ్యాయామాన్ని ఓ భాగంగా చేసుకోవాలని సూచించారు. క్రీడలు, రెజ్లింగ్ పోటీల్లో ప్రావీణ్యం సంపాదించి కుటుంబానికి, దేశానికి పేరు తీసుకురావాలని అన్నారు.కార్యక్రమంలో కోచ్ వీరేష్, ఉదయ్, శుభం, సంజయ్,రబ్బాని,శశి,చరణ్,ప్రత్యూష్,రాంపాల్, వంశీ, శివ, రవి, డాక్టర్ ఉదయ్,ఫయాజ్,జుబేర్,ఉస్మాన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**మల్కాజ్‌గిరి, మే 18,ప్రభాతవార్త :**

మౌలాలి డివిజన్ పరిధిలోని సిలికాన్ బేకరీ ఆఫీసర్స్ కాలనీ, షఫీ నగర్ మరియు సాదుల్లా నగర్ ప్రాంతాలలో రూ.64 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.సిలికాన్ బేకరీ ఆఫీసర్స్ కాలనీలో రూ.36 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు, అలాగే షఫీ నగర్ మరియు సాదుల్లా నగర్ ప్రాంతాలలో రూ.28 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా ఆఫీసర్స్ కాలనీలోని పార్వతి నగర్‌లో గల శ్రీ పంచవటి క్షేత్రం ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అలాగే షఫీ నగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, డెడ్ ఎండ్ ప్రాంతంలో ర్యాంపు మెట్లు నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యే గారిని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, అమీనుద్దీన్, వంశీ ముదిరాజ్, ఉస్మాన్, మారుతి ప్రసాద్, ఇబ్రహీం, భాగ్యనంద్ రావు, ఆదినారాయణ, మహేష్, హరీష్, సంపత్ యాదవ్, బాలకృష్ణ, నర్సింగ్ రావు, దినేష్, సందీప్, లక్ష్మణ్, నవాబ్ తదితరులు, బీఆర్ఎస్ కార్యకర్తలు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : జెడ్‌సి రాధిక గుప్తా



ఉప్పల్ చౌరస్తాలో కారిడార్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

**ఉప్పల్, మే 18 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తాలో ట్రాఫిక్ దారి మళ్లింపు సందర్భంగా వాహనదారులకు ఇబ్బందిలేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కోరారు. ఈ మేరకు పలువురు అధికారులతో కలిసి కారిడార్ పనులను పరిశీలించారు. వరంగల్ జాతీయ రహదారి మూసివేసిన కారణంగా ప్రజలు ప్రత్యామ్నాయ రహదారుల నుంచి వెళ్లాలని కోరారు. ట్రాఫిక్ పోలీసులు నిర్ణయించిన మేరకు అన్ని రహదారుల వెంట బారికేడ్లు ఏర్పాటు చేశామని, హెచ్చరిక బోర్డులు పెట్టించామని తెలిపారు. హబ్సిగూడ నుంచి వచ్చే ప్రజలు బీరప్పగడ్డ మీదుగా వరంగల్‌కు వెళ్లాలని, వరంగల్ నుంచి వచ్చే ప్రయాణికులు లక్ష్మారెడ్డి కాలనీ, భగాయత్ రోడ్డు మీదుగా నాగోల్ వెళ్లి అక్కడి నుంచి జాతీయ రహదారి వెంట రావాలని సూచించారు. అదే విధంగా సోమవారం నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఐదు ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. టౌన్‌ప్లానింగ్ మూడు, ఇంజనీరింగ్ రెండు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ నిర్దిష్ట గడువులో చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోన్ విభాగాధిపతులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## శుభకార్యానికి వెళ్లి వచ్చే సరికి ఇల్లు గుల్ల

**హయత్ నగర్, మే 18 ప్రభాతవార్త :** శుభ కార్యానికి వెళ్లి వచ్చే సరికి దుండగులు ఇంటి తాళం పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను అపహరించుకు పోయిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... పెద్ద అంబర్ పేట లోని శిల్పి కాలనీలో నివాసముండే బండ శశిధర్ రెడ్డి ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల16న ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తుర్కయాంజల్‌లో జరిగిన ఒక ఫంక్షన్‌కు వెళ్లారు.18న ఉదయం 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చి చూడగా, ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా... ఇంటిలోని అల్మరా తెరిచి ఉంది. అందులోని సుమారు 5 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలు కన్పించలేదు. శశిధర్ రెడ్డి ఫిర్యాదు మేరకు హయత్ పోలీసులు క్లూస్ టీమ్ తో ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితుని ఇంటి పక్కనే ఉన్న మరో ఇంటిలో కూడా చోరీ ప్రయత్నం జరిగినప్పటికీ ఎలాంటి ఆస్తి నష్టం జరగలేదు.

## కుళ్ళిన మృతదేహం స్వాధీనం

**హయత్ నగర్, మే 18 ప్రభాతవార్త :**

హయత్ నగర్ లోని బాతుల చెరువు సమీపంలోని స్మశాన వాటికలో కుళ్ళిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహన్ని సోమవారం హయత్ నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించాను. మృతదేహం బాగా కుళ్లిపోయి చేతులు, కాళ్లను కుక్కలు పాక్షికంగా కొరికినట్లు గుర్తించారు. మృతుడి వద్ద చింతకుంట్ల అఖిల్, నల్లగొండ జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపల్లి గ్రామం చిరునామాతో కూడిన ఆధార్ కార్డు లభించింది. మృతుడి సంబంధీకులు వివరాలకు హయత్ నగర్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని సీఐ నాగరాజు గౌడ్ సూచించారు.